
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శుక్రవారం 8 ఆగస్టు 2025





అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రి నారా లోకేశ్



పట్టు, నూలు దారాలతో వివిధ సంస్కృతుల కలబోతగా నేత కళాకారులు రూపొందించిన ఆంధ్రరాష్ట్ర చిత్రపటాన్ని, చేనేత కుటుంబాల తరపున సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న మంత్రి లోకేశ్

చేనేతకు చేయూత



సీఎం చంద్రబాబును గజమాలతో సత్కరిస్తున్న చేనేతలు



సీఎం చంద్రబాబుకు రాఖీ కడుతున్న టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి

నేతన్నలకు రూ.25 వేలు భరోసా

మంగళగిరి, గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): 'చేనేత కార్మికులకు చేయూత అందిస్తాం. ఏటా నేతన్న భరోసా కింద రూ.25 వేలు ఇచ్చే బాధ్యత నాది. రాజధాని అమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటు చేస్తాం. ప్రతి కుటుంబానికి నెలకు రూ.15 వేలు విద్యుత్ భారం తగ్గేలా నెలకు 200 యూనిట్ల కరెంటును ఉచితంగా ఇస్తాం. చేనేత కార్మికులకు ఎంత ఇచ్చినా అది తక్కువే. చేనేత ఉత్పత్తులపై వేసే జీఎస్టీని 5 శాతం రాష్ట్ర ప్రభుత్వం తరఫున రీయింబర్స్ చేస్తాం. త్రిఫ్ట్ ఫండును పునరుద్ధరించి 5,386 మందికి రూ.5 కోట్లు విడుదల చేస్తున్నాం.' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేనేత కార్మికులపై వరాల జల్లు కురిపించారు. పదకొండో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మంగళగిరి ఆటోనగర్‌లోని వీవర్‌శాల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీవర్‌శాలలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో చేనేత వస్త్ర ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ నైపుణ్యం, సృజనాత్మకతల కలబోత చేనేత అన్నారు. 1905లో ఆగస్టు 7న మొదలైన స్వదేశీ ఉద్యమ స్ఫూర్తి తో జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నా మని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో చేనేత రంగం కుదేలైపోయిందన్నారు. ఆప్కో ద్వారా (మిగతా 6లో)



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్, చిత్రంలో సీఎం చంద్రబాబు

చేనేతలు.. నా కుటుంబసభ్యులు

మంత్రి నారా లోకేశ్

'2019 ఎన్నికల్లో 5300 ఓట్ల తేడాతో ఓడిపోగా దాని పక్కన ఓ సున్నా కలుపుకుని 53 వేల ఓట్ల ఆధిక్యంతో గెలిపించాలని మంగళగిరి ఓటర్లను 2024 ఎన్నికల్లో అభ్యర్థించాను అయితే ఏకంగా 91,413 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలిపించిన విషయాన్ని మరువలేను. అందుకే ఇక్కడి చేనేత సోదరులను తన కుటుంబసభ్యులుగా భావించి వారి సంక్షేమం శ్రేయస్సుకోసం అహర్నిశలు శ్రమిస్తున్నాను..' అని స్థానిక ఎమ్మెల్యే మంత్రి లోకేశ్ తెలిపారు. అంచనాలకు మించి అందించిన మెజారిటీతో వచ్చిన బలంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లతో పోరాడి మరీ మంగళగిరిలో 200కు పైగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. మంగళగిరిలో దశాబ్దాల నాటి నివేశన పట్టాల సమస్యను కేబినేట్‌లో పెట్టి పరిష్కరించడంతో పాటు మొత్తం రాష్ట్రానికి కూడా దానినో దిక్సూచిగా మలిచామన్నారు. మొదటి విడతలో రూ.వేయి కోట్ల భూమిపై 3 వేల కుటుంబాలకు హక్కులను కల్పిస్తూ వస్త్రాలు పెట్టి పట్టాల పంపిణీని అవినీతిరహితంగా పారదర్శకంగా నిర్వహించామని చెప్పడానికి తానెంతో గర్విస్తున్నానన్నారు. ఇలా ఎన్నో కార్యక్రమాలను తాను చేయగలుగుతున్నానంటే తనపైన, తమ కుటుంబంపైన మంగళగిరి ప్రజలు చూపిన ప్రేమాభిమానాలే కారణన్నారు. మంగళగిరికి చెందిన పద్మశాలీ నాయకులకు రాష్ట్రస్థాయి గుర్తింపునిచ్చేలా వారికి ఉన్నత పదవులనిచ్చి గౌరవించామన్నారు. గతంలో తాను ఓటమిపాలై ప్రతిపక్షంలో ఉన్నా మంగళగిరిలో చేనేతల సంక్షేమం కోసం 26 రకాల పథకాలను సొంత ఖర్చులతో నిర్వహించానని గుర్తుచేశారు. మంగళగిరిలో వీవర్‌శాలను ఏర్పాటు చేయించి డిజైన్లు, లేటెస్ట్ మగ్గాలను చేనేత కళాకారులకు అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో చేనేత సలహాదారు సుచిత్ర ఎల్లా, మండలి చీఫ్‌విప్ పంచుమర్తి అనూరాధ, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత వైభవానికి పుట్టినిల్లు

భారతీయ శక్తికి, సంస్కృతికి, సంప్రదాయానికి శతాబ్దాల క్రితమే ప్రపంచ వ్యాప్తంగా మన చేనేత ఖ్యాతి తెచ్చింది. అటు నైపుణ్యం, ఇటు సృజనాత్మక శక్తి కలబోతే చేనేత. అందులో మన తెలుగు నేల చేనేత వైభవానికి పుట్టినిల్లు. నాగరికతకు మూలం నేతన్న. హరప్పా నాగరికత నుంచి చేనేత అభివృద్ధి చెందింది. కాకతీయుల కాలంలో నాణేలపైన నేతన్నల ముద్ర ఉండేది. బ్రిటీషు వారు చేనేత వస్త్రాలను ఇక్కడి నుంచి కొనుగోలు చేసి ఇతర దేశాలలో విక్రయించుకున్నారు.



నైపుణ్య శిక్షణ.. ఉత్పత్తుల మార్కెటింగ్

రాజధానిలో హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటు

చేనేత దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వరాలు



Government of Andhra Pradesh / ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
Consumer Affairs, Food & Civil Supplies Department
National Food Security Act, 2013
RICE CARD / రైస్ కార్డు
బియ్యం కార్డు రకం : NFSA/AAY
బియ్యం కార్డు నెం. : 2800019513
కుటుంబ పెద్ద పేరు :
పుట్టిన తేది /వయస్సు : 24-04-1985 / 39 సం.
కుటుంబ పెద్ద లింగం : Female / ఆడ
కుటుంబ సభ్యులు : 6
దుకాణం ఐడి : 0201021
దుకాణం చిరునామా :

ఇక.. స్మార్ట్‌గా.. రేషన్

25 నుంచి కార్డుల పంపిణీకి సన్నాహాలు

జిల్లాలో కొత్తగా 5,288 మందికి కార్డులు మంజూరు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం ఇచ్చిన రేషన్ కార్డులను రద్దు చేసి వాటి స్థానంలో కొత్తగా కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఏటీఎం కార్డు తరహాలో స్మార్ట్ రేషన్ కార్డులను జారీ చేయనున్నది. క్యూఆర్ కోడ్‌తో ఏటీఎం తరహాలో స్మార్ట్ కార్డు ఉంటుంది. ఓ వైపు లబ్ధిదారుడి ఫొటో, వెనుక వైపు కుటుంబసభ్యుల పేర్లతో కార్డులను రూపొందించారు. ఆయా స్మార్ట్ కార్డులను ఈ నెల 25 నుంచి పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. స్మార్ట్ కార్డులతో పాటు కొత్తగా మంజూరు చేసిన కార్డులను కూడా పంపిణీ చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతు న్నారు. కార్డుల్లో మార్పులు చేర్పుల ప్రక్రియకు అవకాశం కల్పించగా 58,183 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఈ క్రమంలో ఆయా దరఖాస్తులను కూడా పరిష్కరించేందుకు పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

5,288 మందికి కార్డులు

జిల్లాలో కొత్తగా కార్డుల కోసం 7,766 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. వీటిని పరిశీలించిన అధికారులు 2,478 దరఖాస్తులను తిరస్కరించారు. 5,288 కుటుంబాలకు కొత్తగా కార్డులు జారీ చేయ నున్నారు. ఆయా కార్డుదారులకు ఇప్పటికే రైస్ కార్డు నెంబర్ జారీ చే శారు. అయితే డీలర్ల వద్ద ఈ పోస్ మిషన్లకు కొత్త కార్డుల నెంబర్లను జత చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తి అయితేనే డీలర్లు కొత్త కార్డు దారులకు రేషన్ పంపిణీ చేస్తారు. వివాహం అయిన వారు కుటుంబ విభజన కోసం ఎన్నో ఏళ్లుగా కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం విభజన కార్డులు జారీ చేయకపోవడంతో ఆ కుటుంబాలు వివిధ పథకాలు కోల్పోయి నష్టపోయాయి. కుటుంబ విభజన కోసం 8,196 దరఖాస్తులు దాఖలు చేశారు. వీటిని కూడా పరిష్కరించి కుటుం బాలను విభజించి కొత్త కార్డులు జారీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్తగా 5,288 కార్డులు, కుటుంబ విభజనతో 8,196 కార్డు లు పెరగనున్నాయి. వీటితో జిల్లాలో కార్డుల సంఖ్య 6,36,275కు పెరగ నుంది. గతంలో ఉన్న కార్డులో కుటుంబ సభ్యుల సంఖ్య కూడా గణనీయంగా పెరగనున్నది.



ఇరుకుపాలెంలో ఈ పంట నమోదు విధానాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జగ్గారావు

పంట నమోదు వేగవంతం చేయాలి

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి జగ్గారావు

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఈ-పంట నమోదును వేగవంతంగా చేయాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి జగ్గారావు తెలి పారు. మండలంలోని వీఏఏ, వీహెచ్ఏ, ఎంపీఈ వోలతో గురువారం వ్యవసాయ శాఖ కార్యాల యంలో ఈ-పంట నమోదుపై ఆయన సమీక్షిం చారు. అనంతరం పట్టణంలోని, సహకార సం ఘాల్లోని ఎరువుల నిల్వలను ఆయన పరిశీలిం చారు. భౌతిక నిల్వలకు, ఈ-పోస్టు మిషన్‌లో ఉన్న నిల్వలకు వ్యత్యాసం ఉంటే ఉపేక్షించేది లేదని అటువంటి డీలర్లకు ఎరువుల స్టాక్ నిలిపి వేస్తామని హెచ్చరించారు. ముందుగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన నల్లబర్లి పొగాకు కేంద్రాన్ని సందర్శించి కొనుగోళ్లపై ఆరా తీశారు.

ఈ-పంట నమోదు పరిశీలన

ముప్పాళ్ల: మండలంలోని ఇరుకుపాలెంలో ఈ-పంట నమోదును వ్యవసాయ శాఖ జిల్లా అధికారి జగ్గారావు పరిశీలించారు. ప్రతి సర్వే నెంబరులోని పంటను, పంట రకం, విస్తీర్ణం తప్పుగా నమోదు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తప్పుగా నమోదు చేస్తే ప్రభుత్వం పంట కొనుగోలు చేసే సమయంలో రైతులకు ఇబ్బందులు వస్తాయన్నారు. ఆయన వెంట ఏడీఏ రవిబాబు, ఏవోలు శ్రీధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

బస్సుల్లో పెరగనున్న.. స్త్రీ శక్తి మేరకు ఏర్పాట్లు

● మహిళల ఉచిత ప్రయాణానికి ఆర్టీసీ సమాయత్తం ● పల్లెవెలుగు బస్సుల్లో ప్రత్యేక సౌకర్యాలు ● బస్టాండ్లలోనూ.. అదనపు హంగులు. ● మహిళల రద్దీకి అనుగుణంగా చర్యలు



మిర్చి కాటా వేయగానే రైతు ఫోన్‌కి ఎస్ఎంఎస్

● మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత

8

మహా సభ.. ఎరుపెక్కిన వినుకొండ

జాతీయ అవార్డు అందుకున్న కర్నాటి మురళి

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

6

సరికొండపాలెం నుంచి వినుకొండకు మట్టి తరలింపు..

బడుల మూతతో బాధలు

● పిల్లల్ని పక్క గ్రామాలకు పంపుతోన్న తల్లిదండ్రులు ● తక్కెళ్లపాడు, అలుగుమల్లెపాడులో 15 ఏళ్లుగా బంద్

దాచేపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తక్కెళ్లపాడు, అలుగుమల్లెపాడు గ్రామాల్లో 15 ఏళ్లుగా బడులు మూతపడ్డాయి. దీంతో తల్లిదండ్రులు పిల్లల్ని పక్క గ్రామాల్లోని పాఠశాలలకు పంపుతున్నారు. గతంలో పాఠశాలలు ఉన్నా పిల్లలు తక్కువగా ఉన్నారనే సాకుతూ వాటిని మూసేశారు. దీంతో అప్పటి నుంచి పిల్లలకు బడి బాధలు మొదలయ్యాయి. గ్రామాల్లో బడులు అందుబాటులో లేకపోవడంతో సుదూరంగా ఉన్న గ్రామాలకు ఆటోలు, ప్రైవేట్ బస్సుల్లో ప్రయాణం చేసి ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితి ఎక్కడో మారుమూల కాదు దాచేపల్లి మండల కేంద్రానికి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలోని తక్కెళ్ల పాడు, అలుగుమల్లెపాడు గ్రామాల్లోనే నెలకొంది. అయినా అటు అధికారులు, ఇటు పాలకులకు బడి బాధల సమస్య పట్టడంలేదు. తక్కెళ్లపాడులో సుమారు 2వేల మంది జనాభా ఉండగా గ్రామంలో 60 శాతానికి పైగా ప్ర జలు చదువుకున్నారు. గ్రామంలో బడి మూతతో పాఠశాల భవనం పూర్తిగా శిథిలమైపోయింది. నూటికి నూరు శాతం అక్షరాస్యత ఉన్న అలుగుమల్లెపాడు గ్రామంలోని పిల్లలంతా కూడా ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారు. గ్రామంలోని పాఠశాల మూత పడి ఉండటంతో యాచకులకు ఆవాస యోగ్యంగా మారింది.



అలుగుమల్లెపాడులోని ప్రాథమిక పాఠశాలలో ఆరేసిన దుస్తులు

ప్రతీ శనివారం చేనేత ధరించాలి

● ప్రభుత్వ ఉద్యోగులకు కలెక్టర్ సూచన

నరసరావుపేట టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు ప్రతి శనివారం తప్పనిసరిగా చేనేత వస్త్రాలు ధరించాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కళాకారులకు అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నాయన్నారు. జిల్లాలో 2160 మంది చేనేత కార్మికులు పింఛన్లు పొందుతున్నారన్నారు. మగ్గం ఉన్న వారికి 200 యూనిట్లు, మర మగ్గం ఉన్న వారికి 500 యూనిట్లు విద్యుత్ ఉచితంగా సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. వర్కింగ్ క్యాపిటల్ ఫైనాన్స్ ముద్ర యోజన వంటి పథకాల ద్వారా అందించే రుణాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దశాబ్దలుగా చేనేత రంగంలో సేవలు అందిస్తున్న పలువురిని సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి స్థానిక భువన చంద్ర టౌన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన చేనేత ఎక్స్‌పోను కలెక్టర్ సందర్శించారు. కార్యక్రమంలో చేనేత వస్త్ర జిల్లా అధికారి రాఘవరావు, ఆర్డీవో మధులత, తహసీల్దారు వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.



చేనేత ఎక్స్‌పోలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే చదలవాడ, ఆర్డీవో మధులత తదితరులు



వినుకొండలోని సురేష్ మహల్

స్వర్ణ తెర

యాభై ఏళ్లు పూర్తి చేసుకున్న సినీ థియేటర్లు

8

తెలుగు సినిమా స్వర్ణయుగాన్ని చూసిన వెండి తెరలు. చిత్ర ప్రదర్శనలో బ్లాక్ అండ్ వైట్ నుంచి.. అత్యాధునిక సాంకేతికత చూసిన థియేటర్లు. రీల్ ప్రొజెక్టర్..డాల్బీ అట్మాస్ వరకు ఆధునిక హంగులు అద్దుకుని కొనసాగుతున్న మహాళ్లు..పిక్చర్ ప్యాలెస్‌లు.. టాకీస్‌లు.. పైరసీలను, ఓటీటీ ప్లాట్‌ఫాంలను.. తట్టుకుని నేటికీ సింగిల్‌గా నిలబడిన సినిమా హాళ్లు. స్వర్ణోత్సవాలు(50 ఏళ్లు..) పూర్తి చేసుకుని శతమానం భవతి అంటూ సినీ ప్రియులను అలరిస్తున్న.. చరిత్రకు ఆనవాళ్లు.. ఎన్నో జ్ఞాపకాలు. ఓల్డ్ ఈజ్ గోల్డ్ థియేటర్లపై ప్రత్యేక కథనం.

-ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్

తెలుగు చిత్ర పరిశ్రమ గమనానికి ఆనవాళ్లు

శతమానం భవతి అంటూ.. ఆధునిక హంగులు

ఏన్నో ఒడుదుడుకులు ఎదుర్కొని సింగిల్‌గా నిలబడిన థియేటర్లు

పాఠశాలను దత్తత తీసుకున్న కలెక్టర్



విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్థానిక శంకరభారతీపురం ఉన్నత పాఠశాలను ప ల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు దత్తత తీసుకున్నారు. గురువారం కలెక్టర్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశా రు. విద్యార్థుల సామర్థ్యా లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తానని, ప్రతి నెలా చదువులో వెనుకబడిన విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తానని తెలిపారు. ఉపా ధ్యాయులు సిలబస్ పూర్తి చేయడం మీద కంటే పాఠాలు అర్థమయ్యేలా.. బోధించడంపై దృష్టి సారించాల న్నారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక అంశాలపై పట్టు సాధించేలా.. కృషి చేయాలన్నారు. వారంలో రెండు సార్లు డిప్యూటీ ఈవో పాఠశాలను సందర్శించి బోధన పద్ధతులను సమీక్షించాలని ఆదేశించారు. కలెక్టర్ దత్తత నిర్ణయం పట్ల ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హర్షం వ్యక్తం చేశారు.

చేనేతకు.. చేయూత


(5వ పేజీ తరువాయి)

కొనుగోళ్లు ఆపేశారని, ముడి సరుకులపై సబ్సిడీని నిలిపివేశారన్నారు. తాము వాటన్నింటినీ పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. చేనేత కార్మికుల ఆదాయం రెట్టింపు చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ ఏడాది చేనేత పరిశ్రమ రూ.1,375 కోట్ల టర్నోవర్ సాధించిందని, చేనేతల ఆదాయం 30 శాతం పెరిగిందన్నారు. అయితే అది సరిపోదని ఆధునిక మార్కెట్‌ను సొంతం చేసుకునేలా నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలన్నారు. వినూత్న రీతుల్లో ఉత్పత్తులు తయారు చేయడం, మార్కెట్ సదుపాయాన్ని కల్పించడంపై చేనత సలహాదారుగా నియమితులైన పారిశ్రామికవేత్త సుచిత్ర ఎల్లా సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. లోకేశ్ నేతృత్వంలో నిర్వహిస్తున్న మంగళగిరిలో 'వీవర్‌శాల' ప్రయోగాత్మక నమూనా అన్నారు. టాటా, బిర్లా వంటి ప్రముఖ సంస్థలతో అనుసంధానం చేసుకుని చేనేత మార్కెట్ అవకాశాలను పెంచుకునే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే, రాష్ట్రమంతటా అమలు చేస్తామన్నారు. వన్ ప్రాజెక్ట్ వన్ డిస్ట్రిక్ట్ పథకంలో రాష్ట్రానికి తొమ్మిది అవార్డులు వస్తే అందులో 3 అవార్డులు చేనేతకే రావడం చేనేతకు దక్కిన అరుదైన గౌరవమన్నారు. అలాంటి చేనేతను సంరక్షించడమే తమ కర్తవ్యంగా భావిస్తున్నామని తెలిపారు. చేనేత వస్త్ర ఉత్పత్తులను ఈ కామర్స్ పద్ధతిలో ఓఎన్‌డీసీ ద్వారా అందరికీ అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. ఇప్పటి వరకు 2వేల రకాల చేనేత ఉత్పత్తులు ఓఎన్‌డీసీ రిజిస్టర్ అయ్యాయని చెప్పారు. మంత్రి లోకేశ్ కోరిన విధంగా మంగళగిరిలో ప్రగడ కోటయ్య పార్కును ఏర్పాటు చేసి, అక్కడ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన జయంతిని అధికారికంగా నిర్వహిస్తామన్నారు. వెంకటగిరిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాండ్లూమ్ సంస్థకు ఆయన పేర నామకరణం చేశామన్నారు. రాష్ట్రంలోని 93 వేల చేనేత కుటుంబాల సంక్షేమానికి యాక్షన్‌ప్లాన్ తయారుచేసి దానిని త్రికరణశుద్ధిగా అమలుచేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

అన్నింటా ఒక అడుగు ముందున్న లోకేశ్..

మంగళగిరి నియోజకవర్గంలో 200 అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహణతోపాటు, 2 వేల పనులు పూర్తి చేసిన లోకేశ్ అందరికంటే ఒక అడుగు ముందున్నారని సీఎం కొనియాడారు. 5 వేల ఓట్లతో ఓడిన చోటే.. తిరిగి 91 వేల ఓట్లతో గెలిచారన్నారు. తనను గెలిపించిన ప్రజల జీవితాల మెరుగుదలకు లోకేశ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాష్ట్రంలో మంగళగిరిని నెంబర్ వన్‌గా చేయాలన్న ఆయన సంకల్పం కచ్చితంగా నెరవేరుతుందన్నారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు



ఎక్సకవేటర్‌తో మట్టి తవ్వకం

బొల్లాపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరికొండపాలెం సమీపంలో మట్టి మాఫియా అక్రమ తవ్వకాలు యథే చ్ఛగా జరుగుతున్నాయి. ఎర్రమట్టికి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో అక్రమార్కులు దీనిని అడ్డగోలుగా తవ్వి పట్టణంలోని కొన్ని వెంచర్లకు మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ భూముల్లోని మట్టిని తవ్వేసి తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్థానిక ప్రజలు మట్టి మాఫియాపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పొక్లెయినర్లు, టిప్పర్లతో భారీ ఎత్తున మట్టిని వినుకొండకు తరలిస్తుండడంతో.. రోడ్డు కూడా అధ్వానంగా తయారైంది. అధికారులు తక్షణమే స్పందించి తవ్వకాలు ఆపాలని, కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహా సభ.. ఎరుపెక్కిన వినుకొండ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



ప్రత్యేక ఆకర్షణగా దేశ నాయకుల వేషధారుల ర్యాలీ

వినుకొండటౌన్ ఆగష్టు 7 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రెండవ పల్నాడు జిల్లా మహాసభ పల్నాడు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మారుతీవర ప్రసాద్ అధ్యక్షతన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు బయపడిన ప్రధాని మోదీ ఒక పిరికిపందా అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా వివిధ దేశనాయకుల వేషధారణలతో నిర్వహించిన ర్యాలీ విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విల్సన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దళిత యువకుడిపై..

భూమన కుటుంబం దాడి దారుణం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కలియుగ వెంకటేశ్వరుస్వామి కొలువైన తిరుమల తిరుపతిలో దళిత యువకుడిపై భూమన కరుణాకర్‌రెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో వైసీపీ అనుచరులు దాడి చేయడం దారుణం అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతిలో భూమన కరుణాకర్‌రెడ్డి కుమారుడు అభినయ్‌రెడ్డి కార్యాలయంలో వైసీపీ రౌడీలు ఒక దళిత యువకుడిని బంధించి స్పృహ కోల్పోయో వరకు క్రూరంగా కొట్టారని పేర్కొన్నారు. ఈ దారుణ ఘటనను వీడియో తీసి సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేస్తూ, బాధితులను భయపెడుతున్నారని తెలిపారు. ఈ దారుణ ఘటన పుణ్యక్షేత్రమైన తిరుపతిని అపవిత్రం చేయడమే.. కాకుండా భూమన కరుణాకర్‌రెడ్డి రౌడీయిజంతో సమాజంలో భయాందోళనలను సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. రౌడీయిజం చేయడం.. ప్రెస్ మీట్లతో... శుద్ధ పూస స్టేట్మెంట్‌లు ఇవ్వడం ఇదే భూమన నైజం అన్నారు. మాస్క్ అడిగిన పాపానికి ఏకంగా అధినేత ఒక డాక్టర్ని పొట్టన పెట్టుకు న్నాడని పేర్కొన్నారు. ఆ పార్టీలో ఇంకొకరమో.. దళితుడిని చంపి డోర్‌డెలివరీ చేస్తాడని, ఇంకోకడు గుండు కొట్టిస్తాడని.. దళితుల మీద దమనకాండ కొనసాగించారని ఆయన తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు.

నాకు మాటిచ్చి.. వేరే వారికి అమ్మారు

● అడ్వాన్స్‌గా రూపాయి తీసుకోలేదు
● అందుకే వెంచర్‌లో సగం వాటా డిమాండ్ చేశా
● ఇందులో ఎమ్మెల్యే నరేంద్ర పాత్ర లేదు
● ఆయన అనుచరుడు మేడికొండూరు నరేష్



మాట్లాడుతున్న నరేష్

గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ఈ నెల 3న ప్రచురితమైన 'వామ్మో.. ఆ ఎమ్మెల్యే.. దందాలతో దడ' వార్తలో భాగంగా సొంత పార్టీ ఎమ్మెల్యేకు సైతం తప్పని తిప్పలు అనే వార్తపై అనుచరుడు మేడికొండూరు నరేష్ యదార్థ సంఘటనలను చెబుతూ గురువారం వివరణ ఇచ్చారు. మద్దాళి రవి కిరణ్ కి చెందిన చేబ్రోలు మండలం, గ్రామంలోని 9 ఎకరాల 34 సెంట్లు మామిడి తోటను అమ్మకానికి పెట్టగా దాని గురించి తెలిసిన మధ్య వర్తి ద్వారా తాను కొనుగోలు చేసేందుకు సిద్ధపడి ఎకరం రూ.65 లక్షలు చొప్పున 75 రోజుల గడువు అడిగినట్లు తెలిపారు. దీంతో రవి కిరణ్ త్వరగా చేయించుకోవాలని, తనకు చాలా అవసరం ఉందని చెప్పగా.. గడువు 75 రోజులు పెట్టండి.. 40 రోజుల్లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోగలనని తాను రవికిరణ్‌కి చెప్పినట్లు నరేష్ పేర్కొన్నాడు. అందుకు అతను అంగీకరించాడని, రవి కిరణ్‌కి అడ్వాన్స్‌గా రూ.50 లక్షలు ఇవ్వడానికి సిద్ధం కాగా తీసుకోలేదని, రిజిస్ట్రేషన్ రోజునే మొత్తం చెల్లించండని చెప్పారని తెలిపాడు. అగ్రిమెంట్ రాసుకుందామని తాను అడగ్గా.. తాను మాట మీద నిలబడే వ్యక్తిని అంటూ.. అగ్రిమెంట్ రాయలేదని నరేష్ తెలిపాడు. తాను కొన్ని రోజుల తర్వాత రిజిస్ట్రేషన్ కోసం వారిని సంప్రదించడానికి ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయకుండా అందుబాటులోకి రాలేదని వివరించాడు. ఆ సమయంలో తాను బయట నుంచి అధిక వడ్డీలకు డబ్బులు సమకూర్చుకుని, వారిని కలిసేందుకు ప్రయత్నించామని చెప్పాడు. రవికిరణ్ ఫోన్ కూడా లిఫ్ట్ చేయకపోవడంతో మధ్యవర్తి ద్వారా మిల్లు వద్దకు వెళ్లగా.. తన మిత్రుడు తాత మరణించాడని, అక్కడ ఉండడటంతో ఫోన్ లిఫ్ట్ చేయలేదంటూ సమాధానం ఇచ్చాడని చెప్పారు. రెండు రోజుల తర్వాత కలుద్దామని చెప్పి.. వారం రోజుల తర్వాత ఫోన్ చేయగా ఆ భూమిని గళ్ళా రామచంద్రరావుకు అమ్మడానికి ఒప్పందం కుదుర్చుకున్నానని చెప్పినట్లు తెలిపారు. ఈ విధంగా చేయడం కరెక్ట్ కాదని చెప్పినా వినిపించుకోలేదని, తాను కలిసిన విషయాన్ని రవికిరణ్ గళ్ళా రామచంద్రరావుకు తెలియజేయగా ఆయన ఎమ్మెల్యే నరేంద్ర దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. తాను ఆ భూమిని కొన్న విషయాన్ని తెలపగా... ఆ భూమిని నరేష్ కొనుగోలు చేస్తున్నట్లు గతంలో తనకు చెప్పాడని నరేంద్ర చెప్పినట్లు తెలిపాడు. అతను కూడా మన పార్టీ వ్యక్తే.. రామచంద్రరావు వద్దకు పంపుతానిని.. ఇద్దరూ కలిసి మాట్లాడుకోండి అని నరేంద్ర చెప్పటం జరిగిందని వివరించారు. ఆ తరువాత ఎమ్మెల్యే నరేంద్ర తనను గళ్ళా రామచంద్రరావును కలవమని చెప్పి, పార్టీ పరంగా తమ రిలేషన్ చెడకుండా వ్యాపార పరంగా విషయం సెటిల్ చేసుకోవాలని ఆయన సూచించినట్లు చెప్పాడు. తాను తరువాత ఎమ్మెల్యే మాధవి భర్త గళ్ళా రామచంద్రరావును కలవగా అయన మాట్లాడుతూ ఈ పొలానికి మొత్తం పెట్టుబడి నువ్వు పెడితే తాను.. తన కంపెనీ పేరు మీద మార్కెటింగ్ చేస్తానని, తనకు 50 శాతం ఇస్తాను.. లేకపోతే తాను 50 శాతం పెట్టుబడి పెడితే.. 20 శాతం లాభాలలో వాటా ఇస్తాను అని చెప్పారని తెలిపారు. ఇందుకు తాను అంగీకరించలేదని చెప్పాడు. ఇద్దరం చెరిసగం పెట్టుబడి పెట్టి లాభాలు సమానంగా పంచుకుందామని రామచంద్రరావుకు చెప్పానని, అందుకు రామచంద్రరావు అంగీకరించలేదని తెలిపాడు. ఆ తరువాత తనకు తెలియకుండా భూ యజమాని ద్వారా రామచంద్రరావు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకున్నాడని చెప్పారు. తమ మధ్య నెలకొన్న ఈ వివాదాన్ని ఎమ్మెల్యే నరేంద్రకు అంటగట్టి బదనాం చేయడం తగదని నరేష్ పేర్కొన్నాడు.

ఎయిడెడ్ టీచర్లను సర్దుబాటు చేస్తాం

● డీఈఓ సీవీ రేణుక

గుంటూరు (విద్య) ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలల అదనపు ఉపాధ్యాయులను సత్వరం సర్దుబాటు చేస్తామని డీఈఓ సీవీ రేణుక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన సర్దుబాటు ఎప్పుడో కథనంపై ఆమె స్పందించారు. ఎంఈఓల ద్వారా అదనపు ఉపాధ్యాయులను గుర్తించి, అవసరమైన పాఠశాలల్లో సర్దుబాటు చేస్తామన్నారు.

భార్యను హతమార్చిన భర్త అరెస్టు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 7,(ఆంధ్రజ్యోతి): కుటుంబ వివాదాల నేప థ్యంలో భార్యను హత మార్చిన భర్త జొన్నలగడ్డ రమేష్‌ను ఐదు రోజుల వ్యవధిలో అరెస్టు చేసినట్లు నరసరావుపేట ఇన్‌చార్జి డీఎస్పీ ఎంవీ రమణ గురువారం తెలిపారు. మొదటి పట్టణ పోలీస్‌స్టేషన్లో విలేకరుల సమావేశం నిర్వహించి, కేసు వివరాలను ఆయన వెల్లడించారు. ఈ నెల 2వ తేదీ రాత్రి మృతురాలు మేరీ తల్లి తన కుమార్తె కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని.. మొదటి పట్టణ సీఐ ఎంవీ చరణ్, ఎస్‌ఐలు వంశీకృష్ణ, అరుణా ప్రత్యేక బృందంగా ఏర్పాటై.. సాంకేతిక శాస్త్రీయ ఆధారాలతో నకరికల్లు అటవీ ప్రాంతంలో శోధించినట్లు తెలిపారు. చివరికి మేరీ మృతదేహాన్ని కారంపూడి రోడ్ లో రైల్వే ట్రాక్ వెంట కనుగొన్నారు. నిందితుడు రమేష్ తన భార్య మేరీని కిరాతకంగా గొంతుపై కాలుతో తొక్కి హతమార్చినట్లు ఫోరెన్సిక్ నివేదికలో తేలిందన్నారు. నిందితుడు రమేష్‌ను పట్టణ శివారు ఎస్‌ఆర్‌కేటీ కాలనీలో అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

జాతీయ అవార్డు అందుకున్న కర్నాటి మురళి



ఢిల్లీలో కేంద్ర మంత్రి గిరిరాజు చేతుల మీదుగా అవార్డు అందుకున్న మురళీ

సత్తెనపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు కర్నాటి మురళీ గురువారం ఢిల్లీలో జరిగిన ప్రపంచ చేనేత దినోత్సవాల్లో.. కేంద్ర హ్యాండ్ లూమ్ మంత్రి గిరిరాజు సింగ్ చేతుల మీదుగా జాతీయ స్థాయిలో ప్రతిభా పురస్కార అవార్డు అందుకున్నారు. కర్నాటి మురళీ మల్టీ డైమండ్, టై అండ్ డై స్కిల్క్ చీరను తయారు చేశారు. ఈ చీర తయారీలో మురళీ ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయనను జాతీయ అవార్డుకు ఎంపిక చేసి అవార్డును, ప్రతిభా పురస్కారాన్ని ప్రధానం చేసింది. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ తాను అవార్డు అందు కోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరింతగా చేనేతలో మెళకువలు నేర్చుకుంటానన్నారు. మురళీ అవార్డు అందుకోవడం పట్ల సత్తెనపల్లి పట్టణానికి చెందిన చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

నడికూడి మార్కెట్‌లో 3800 టిక్కీల మిర్చి అమ్మకం

దాచేపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డుకు గురువారం రూ 4,200 టిక్కీలు చేరుకోగా రూ.3,800 టిక్కీలు అమ్మకం జరిగాయి. 334 రకం రూ.8వేల నుంచి రూ.12,500, తేజా రూ.9వేల నుంచి రూ.14 వేలు, తాలుగాయాలు రూ.2వేల నుంచి రూ.7వేల వరకు అమ్మకాలు జరిగాయి.


బోనస్ పంపిణీ చేస్తున్న డైరెక్టర్ పులుకూరి శ్రీనివాసరావు తదితరులు

డెయిరీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పల్నాడు జోనల్ మేనేజర్ నరేష్‌బాబు

మాచవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రైతులు సంగం డెయిరీ సంక్షేమ పథకాలను సద్వినియోగ పరుచుకొని పాడి సంపదను పెంపొందించుకోవాలని పల్నాడు జిల్లా జోనల్ మేనేజర్ కట్టా నరేష్‌బాబు సూచించారు. గురువారం కొత్తపాలెంలో 2024-25కి రైతులకు ఆయన రూ.2,53,496 బోనస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డెయిరీ డైరెక్టర్ పులుకూరి శ్రీనివాసరావు, స్థానిక సంఘం అధ్యక్షుడు మునగాల సాంబయ్య, గుదె రామారావు, యామని రామారా వు, గుదె సత్యానారాయణ, నవీన్, వెంకటేశ్వర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పేదలపై వరాల జల్లు

సత్తెనపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేదలపై వరాలజల్లు కురిపిస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లిలో గురువారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం-2, అన్నక్యాంటీన్‌లు, ఎన్‌టీఆర్ భరోసా తదితర పథకాలను అమలు చేసి ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలవుతుందన్నారు. నాయి బ్రాహ్మణులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తోందన్నారు. ప్రభుత్వం కొత్త బార్ల పాలసీలో కల్లుగీత కార్మికులకు పెద్ద పీట వేసిందన్నారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం గురువారం నాటికి 588.50 అడుగులు ఉంది. ఇది 307.57 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 5088 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8541, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,420, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్‌ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 44,149 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 65,930 క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతోంది.

పులిచింతల..

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో గురువారం 42.62 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 27,075 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా 400, మొత్తం 17వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

చేనేత ఉత్పత్తులను ఆదరించాలి

పిడుగురాళ్ల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని శ్రీనివాస స్టూడియో ప్రాంగణంలో చేనేత కులాల ఐక్యవేదిక పద్మశాలీయ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ పల్నాడు జిల్లా శాఖల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పద్మశాలీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కస్తూరి చినవెంకటేశ్వర్లు, హనుమంతరావు, పట్టాభి, పాతస్వామి, హనుమంతరావు, శ్రీనివాసరావు, విశ్వేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చేనేతను ప్రోత్సహిస్తున్న కూటమి ప్రభుత్వం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేనేతను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని పణిదం చేనేత సహకారసంఘంలో గురువారం ప్రపంచ చేనేతదినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమం లో ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేత మగ్గాలకు విద్యుత్ సబ్సిడీ ఇస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతోమంది చేనేతలకు చేయూ తనిస్తుందన్నారు. త్రిఫ్ట్ ఫండ్ కింద ఏడాదికి రూ 5కోట్లను ప్రభుత్వం విడుదల చేసి చేనేత కార్మికులకు అండగా ఉంటుందన్నారు. కార్మికుల నేత వస్త్రాలను కన్నా పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, కౌన్సిలర్ తురక మేరీ గ్రేస్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు కట్టా శివదుర్గారావు, నాయకులు మస్తాన్‌వలి, మారెళ్ళ మల్లేశ్వరరావు, గుంటూరు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.


సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంజులారెడ్డి

అదనపు తరగతి గదుల నిర్మాణానికి కృషి

శిల్పారామం చైర్మన్ మంజులారెడ్డి

రెంటచింతల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రెంటాల జడ్పీ హైస్కూల్లో అదనపు తరగతి గదులు నిర్మాణానికి కృషి చేస్తానని శిల్పారామం చైర్మన్ చేర్రెడ్డి మంజులారెడ్డి హామీనిచ్చారు. గురువారం పాఠశాల ఆవరణలో సరస్వతి దేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. హెచ్‌ఎం నాగభారతి అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మట్లాడుతూ ప్రస్తుతం అప్పర్ ప్రైమరీ పాఠశాలలోనే 8,9,10 తరగతులు నిర్వహించడం అసౌకర్యంగా ఉన్న విషయాన్ని ఎమ్మెల్యే, విద్యామంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో 2 శివనాగేశ్వరరావు, టీచర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

ఆర్తుల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

మాచర్లటౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఆర్తుల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 48 మంది లబ్దిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.41.78లక్షల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో పంగులూరి పుల్లయ్య, కూటమి నేతలు పాల్గొన్నారు.

గిరిజన గురుకులానికి స్థలం అప్పగింత

● ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

రెంటచింతల: రూ.4.10కోట్లతో చేపట్టబోయే గిరిజన సంక్షేమ గురుకులానికి 5 ఎకరాలు కేటాయిస్తూ కలెక్టర్ అరుణ్‌బాబు ఉత్తర్వులు జారీచేశారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం రెంటచింతలలో విలేకర్లతో మాట్లాడుతూ రెంటచింతల, మాచర్లలో రహదారుల విస్తరణకు ప్రభుత్వం రూ.54 కోట్లు కేటాయించిందని త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. పుల్లయ్య, అబ్బిరెడ్డి, సుమంత్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

దరువూరి జన్మదిన వేడుకలు


దరువూరి నాగేశ్వరరావు జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేయిస్తున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రఘురామ్‌నగర్ టీడీపీ ప్రజావేదికలో గురువారం నియోజకవర్గ టీడీపీ పొలిటికల్ మేనేజర్ దరువూరి నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దరువూరి నాగేశ్వరరావుతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కేక్‌ను పంపిణీ చేశారు. ఏరియా వైద్యశాలలో రోగులకు టీడీపీ నేతలు చౌట శ్రీనివాసరావు, జవ్వాజి రామ్మోహనరావు, మారెళ్ళ స్వామిలు రొట్టెలు, పండ్లు పంపిణీచేశారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఏరియా వైద్యశాలలో రోగులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, మక్కపాటి రామచంద్రరరావు, సయ్యద్ పెదకరిముల్లా, బలిజేపల్లి సురేష్‌కుమార్, బండారు నాగరాజు, బొజ్జా కాంతారావు, చిలకా చంటి, గుంటూరు ఆశీర్వాదం, కూటమి నేతలు పాల్గొన్నారు.

మోంట్‌పోర్ట్ స్కూల్ ఏర్పాటు అభినందనీయం


మోంట్‌పోర్ట్ స్కూల్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్, ప్రతాపరెడ్డి, షైన్ అలెక్స్

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అమరావతిలో మోంట్‌పోర్ట్ పాఠశాల ఏర్పాటు చేయడం అభినందనీయం అని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సంస్థ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రతాపరెడ్డి, ప్రోవిన్షియల్ సుపీరియర్ షైన్ అలెక్స్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. షైన్ అలెక్స్ మాట్లాడుతూ మంత్రి లోకేశ్ తమ విద్యాసంస్థలో విద్యను అభ్యసించారన్నారు. ప్రతాపరెడ్డి మాట్లాడుతూ రెండేళ్లలో విద్యాసంస్థ అందుబాటులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో వివిధ బ్రాంచీలకు చెందిన ప్రిన్సిపాల్స్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆయుష్య హాస్పిటల్ ప్రారంభం

అమరావతిలోని క్రోసూరు రోడ్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన ఆయుష్య హాస్పిటల్‌ను ఎమ్మెల్యే ప్రవీణ్ ప్రారంభించారు. గురువారం జరిగిన కార్యక్రమంలో వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ మంచికలపూడి వెంకటకృష్ణ, డాక్టర్ వట్టికుంట లక్ష్మీమౌనిక వైద్యశాలలో సదుపాయాలను ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను ఉపయోగించుకోండి...

పిడుగురాళ్ల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సెప్టెంబరు 13వ తేదీ రెండో శనివారం నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను ఉపయోగించుకొని రాజీ పడదగిన కేసులను పరిష్కరించుకోవచ్చని పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి టి.ప్రవల్లిక తెలిపారు. గురువారం పిడుగురాళ్ల కోర్టులో న్యాయవాదులు, పోలీసుశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కుమారస్వామి, కె.వెంకటేశ్వర్లు,దాసు, రమేష్, పిచ్చయ్య, అహ్మద్, సీతారామయ్య, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గురజాలలో.....

జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు ఉపయోగించుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 10వ అదనపు జిల్లా జడ్జి జి.ప్రియదర్శిని తెలిపారు. గురువారం న్యాయవాదులతో కోర్టులో సమావేశం నిర్వహించి లోక్‌అదాలత్‌లో రాజీపడదగిన సివిల్, క్రిమినల్ కేసులను రాజీ పడవచ్చన్నారు. సెప్టెంబరు 13న జరిగే లోక్‌అదాలత్‌ను ఉపయోగించుకోవాలన్నారు. సమావేశంలో సివిల్ జడ్జి వై శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ఏపీపీ సూర్యరాజు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గృహంలో చోరీ యత్నం

సత్తెనపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన గృహంలో చోరీకి యత్నించిన సంఘటన పట్టణంలోని రఘురామ్ నగర్‌లో గురువారం జరిగింది. రఘురామ్ నగర్‌కు చెందిన పీ పద్మ తన గృహానికి తాళం వేసి రెండురోజుల క్రితం బెంగుళూరు వెళ్ళింది. గురువారం మధ్యాహ్నం ఇరువురు దొంగలు ఆ ఇంటి తాళం పగలగొట్టి లోనికివెళ్లారు. బెంగుళూరులో ఉన్న పద్మ సెల్‌ఫోన్‌లో అలారం మోగింది. ఆ ఇంటి సీసీ కెమేరాల ద్వారా పద్మ దొంగలు ఇంట్లోనే ఉన్నట్టు గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. ఇంట్లో శబ్దం రావటంతో దొంగలు ఇరువురు వెనుక వైపునుంచి పరారయ్యారు. సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.50వేల నగదు అపహరణ

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని కరణంగారి బజారులో దేవదారి లక్ష్మీ కోటేశ్వరరావు ఇంటిలో బుధవారం రాత్రి దొంగలు పడి ఇంటిలో ఉన్న 20 తులాల వెండి, రూ.30వేల నగదు అపహరించుకుపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోటేశ్వరరావు గుంటూరు వెళ్లడంతో ఇంట్లో ఎవరూలేరని గ్రహించిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి సొత్తును అపహరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరకట్న వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) మండలంలోని ఎనికపాడు గ్రామానికి చెందిన చిలకా నాగరాజు బాపట్లకు చెందిన మౌనికను 2023లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. అత్తా, భర్తల వరకట్న వేధింపులకు తట్టుకోలేక ఈనెల 5న పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. మౌనిక కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు సీఐ అచ్చియ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఊరికి ఉపకారులను ప్రజలు మరచిపోలేరు

పెదకూరపాడు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఊరికి ఉపకారులను ప్రజల మనసుల్లో ఎప్పుడూ ఉంటారని హెచ్‌ఎం అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని 75 తాళ్ళూరు జడ్పీ హైస్కూల్లో గురువారం పాఠశాల వ్యవస్థాపకులైన గుత్తికొండ తిరుపతిరెడ్డి, కొల్లి చిన పిచ్చిరెడ్డి, వంకా జగన్నాథరావు సేవలు కొనియాడారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, శివరామిరెడ్డి, పిచ్చిరెడ్డి, చంద్రకుమారి పాల్గొన్నారు.

పత్తి పొలంలో లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి

దుర్గి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పత్తిపొలంలో గులాబిరంగు పురుగు నివారణకు ఎకరానికి 20 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ నగేష్ అన్నారు. ఓబులేశునిపల్లె గురువారం పత్తిపంటను ఆయన పరిశీలించా రు. కార్యక్రమంలో ఏవో అమీర్‌రెడ్డి, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

రూ.4.63 లక్షల బోనస్ పంపిణీ

అచ్చంపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పెదపాలెం సంగం డెయిరీలో 107 మంది పాడి రైతులకు రూ 4.63 లక్షలు బోనస్ పంపిణీ చేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు పాల ఉత్పత్తిదారులకు బోనస్‌లు అందించారు. కార్యక్రమంలో రెంటపాళ్ళ బీఎంసీ పీ గోపీ, అధ్యక్షుడు వెంకటనారాయణ, చిరుమామిళ్ళ నరసింహారావు, నవీన్, కోటేశ్వరరావు, పీఎస్ రాజు, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

● బెల్లంకొండ: బెల్లంకొండలో గురువారం రాత్రి భారీవర్షం పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

ప్రభుత్వ ఉద్యోగుల రక్తదానం

క్రోసూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): క్రోసూరులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన రక్తదాన శిబిరంలో పలువురు ప్రభుత్వ ఉద్యోగులు రక్తదానం చేశారు. శిబిరాన్ని తహసీల్దార్ వేముల వెంకటనాగరాజు, క్రోసూరు ఎస్‌ఐ రవిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు, ఎం పీడీవో రవికుమార్, డీటీ శ్రీనివాస్ పాల్గొన్నారు. టీడీపీ నాయకులు సహకారమందించారు.

చెరువును నింపి సాగుకు సహకరించండి

క్రోసూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): క్రోసూరును ఆనుకొని ఉన్న చెరువును నీటితోనింపి మాగాణి పంటల సాగుకు సహకరించాలని క్రోసూరు, ఎర్రబాలెం గ్రామాలకు చెందిన పలువురు రైతులు గురువారం అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఆగస్టు వచ్చినా చెరువులో చుక్కనీరు లేదన్నారు. చెరువు కింద 400ఎకరాల వరకు మాగాణి ఉన్నట్టు తెలిపారు. ఆయకట్టు దారులకు, రైతులకు మేలు కలిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణించరాదు

మాచర్ల రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించరాదని మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా అన్నారు. గురువారం మాచర్ల మండలం కొత్తపల్లి జంక్షన్ వద్ద ప్రయాణికులు, డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విజయపురిసౌత్ ఎస్‌ఐ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

● విజయపురిసౌత్: విజయపురిసౌత్‌లోని రేషన్ షాపులలో తహసీల్దార్ కిరణ్‌కుమార్ గురువారం తనిఖీలు జరిపారు. డీలర్లు సమయ పాలన పాటించాలని సూచించారు.

● విజయపురిసౌత్: పర్యాటక ప్రాంతమైన నాగార్జున సాగర్ విజయపురిసౌత్‌లో నివాసముంటున్న నిరుద్యోగులకు నాగార్జున సాగర్, ఎత్తిపోతల ఫారెస్ట్ చెక్‌పోస్టులో ఉపాధి కల్పించాలని స్థానిక మాలమహానాడు అధ్యక్షుడు బొబ్బిలి చంద్రశేఖర్ అన్నారు.

● మాచర్ల రూరల్: పట్టణంలోని పురపాలక సంఘ కౌన్సిల్ హాలులో శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఎన్నిక జరుగుతున్నట్లు చెప్పారు.

● కారంపూడి: ఈనెల 12వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమ గోడప్రతులను గురువారం స్థానిక పీహెచ్‌సీలో వైద్యులు రమ్య, విజయ్‌నాయక్‌లు విడుదల చేశారు.

● గురజాలటౌన్: గురజాల నగర పంచాయతీ ఆధ్వర్యాన గురువారం పట్టణంలోని శ్రీపాతపాటేశ్వరి ఆలయంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆర్డీవో మురళీకృష్ణ పోటీలను ప్రారంభించారు. గురజాల నగర పంచాయతీ కమిషనర్ శివన్నారాయణ ఆధ్వర్యాన పోటీలు జరిగాయి. కార్యక్రమంలో చైర్మన్ బడేజాని, కూటమినేతలు పాల్గొన్నారు.

● అమరావతి: సీఐ అచ్చియ్య ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌వీవీఎన్ కళాశాలలోని విద్యార్థులకు సైబర్ నేరాలపై ఎస్‌ఐ రాజశేఖర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

● బెల్లంకొండ: వాహనదారులకు లైసెన్స్ తప్పక ఉండాలని ఎస్‌ఐ ప్రవీణ్ పేర్కొన్నారు. గురువారం బెల్లంకొండ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

● విజయపురిసౌత్: చేనేతల నేస్తం సీఎం చంద్రబాబు అని చేనేతలు హర్షం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని కొత్తూరులో చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు పెద వెంకట్రామిరెడ్డి, చిన వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రాజారెడ్డి, వెంకటేశ్వరనాయక్ పాల్గొన్నారు.

సంక్షిప్తం...

● మాచవరం: గ్రామాల్లో జరుగుతున్న స్వమిత్వ సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని డిప్యూటీ ఎంపీడీవో వెంగళరావు ఆయా సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని వేమవరం, మల్లవోలు, పిల్లుట్ల గ్రామాల్లో జరుగుతున్న స్వమిత్వ సర్వేని పరిశీలించి రివ్యూ నిర్వహించారు.

● పిడుగురాళ్ల: అయ్యప్పనగర్‌లో పాల ఉత్పత్తిదారులకు సంగం డెయిరీ డైరెక్టర్ పులుకూరి శ్రీనివాసరావు గురువారం బోనస్ పంపిణీ చేశారు. 2024-25 సంవత్సరానికి రూ.లక్షా 65వేల 320 బోనస్‌ను పాల ఉత్పత్తిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా జోనల్ మేనేజర్ కత్రా నరేష్‌బాబు, ఎ నవీన్, వెంకటేశ్వర్లు, వంగా నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● దాచేపల్లి: చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం మనోధైర్యాన్ని ఇచ్చిందని రాష్ట్ర బీసీ అధికార ప్రతినిధి ముస్యం శ్రీనివాసరావు గురువారం తెలిపారు. కూటమి ప్రభుత్వం చేనేత కార్మికుడికి నెలకు 200యూనిట్లు ఉచిత విద్యుత్‌ను అందించటం సంతోషించాలన్నారు. కూటమి నేతలకు కృతజ్ఞతలు తెలిపిన వారిలో వెంకటేశ్వర్లు, సత్యం, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు ఉన్నారు.

● దాచేపల్లిలో మధ్యాహ్నం నుంచి కుండపోతగా వాన కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొద్ది రోజుల క్రితం వేసిన పత్తి పటకు ఈ వానలు ఉపయోగపడతాయని రైతులు తెలిపారు.

● సత్తెనపల్లి రూరల్: మండలంలోని రామకృష్ణాపురం వినాయకుని ఆలయ వార్షిక మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రత్యేకపూజలు జరిపారు.

● రాజుపాలెం: గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వైద్యాధికారి డాక్టర్ రవిపాల్ నులిపురుగుల దినోత్సవ ప్రచార గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అంగన్‌వాడి కేంద్రాలలో, ప్రభుత్వ ప్రవేటు పాఠశాలలో మాత్రలు పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ముక్కంటి, ఎంఈవో నరసింహరావు జీవనారావు ఉన్నారు.

● నకరికల్లు: నిర్ణీత సమయంలో స్వామిత్వ సర్వేను పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరనాయక్ ఆదేశించారు. గురువారం ఆయన నకరికల్లు సచివాలయంలో స్వామిత్వ సర్వే తీరును తనిఖీ చేశారు. కార్యక్రమంలో పీఎస్ కేవీఎస్ ప్రసాదు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

● ప్రకృతి వ్యవసాయం విజయవంతానికి రైతులు, వ్యవసాయ సహాయకులు భాగస్వాములు కావాలని ఎడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ ప్రేమ్‌రాజ్ అన్నారు. నకరికల్లు రైతు సేవాకేంద్రంలో వ్యవసాయ సహాయకులకు మూడో రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌పీ రామచంద్రం, ఏవో కే దేవదాసు, అప్పలరాజు, నందకుమార్ పాల్గొన్నారు.

● క్రోసూరు: ఈనెల 12వ తేదీన జరిగే నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని క్రోసూరు తహసీల్దార్ నాగరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం అవగాహన కల్పిస్తూ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సిరిచందన, మండల ఆరోగ్యవిస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్, కాండ్రు కాశయ్య, ఎస్‌ఐ రవిబాబు పాల్గొన్నారు.

● పెదకూరపాడు: ఈనెల 12వ తేదీన ప్రారంభమయ్యే జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమ విజయవంతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తహసీల్దార్ ధనలక్ష్మి అన్నారు.ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సోమయాజులు, ఎంఈవోలు ఏకుల ప్రసాదరావు, డాక్టర్ మౌనిక, సత్యనారాయణ పాల్గొన్నారు.

● నాయి బ్రాహ్మణుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషి మరువలేనిదని నాయి బ్రాహ్మణ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ గురువారం తెలిపారు. నాయి బ్రాహ్మణులకు చంద్రబాబు ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్లకు పెంచటంపై కృతజ్ఞతలు తెలిపారు.

● రెంటచింతల: ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. రెంటచింతలలోని ఎర్రపాలెంలో అభయాంజనేయస్వామి, బుడియబాపు స్వామి విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా తొలిరోజైన గురువారం వివిధ రకాల పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

స్వర్ణ తెర

● 50 ఏళ్లు దాటిన సిల్వర్ స్క్రీన్ థియేటర్లు
● తెలుగు సినిమా గమనానికి ఆనవాళ్లు..
● రీల్స్ నుంచి శాటిలైట్ ప్రదర్శన వరకు..
● నేల టిక్కెట్ నుంచి..ఆధునిక హంగులద్దుకుని..
● సినీ ప్రియులకు ఎన్నో జ్ఞాపకాలు

అలంకార్ టాకీస్, సురేష్ మహల్, బాలాజీ పిక్చర్స్, స్వరాజ్ థియేటర్.. తెలుగు చిత్ర పరిశ్రమ స్వర్ణయుగాన్ని చూసిన వెండి తెరలు ఇవి. స్వర్ణోత్సవాలు(50 ఏళ్లు) పూర్తి చేసుకుని..శతమానం భవతి అంటూ కొనసాగుతున్న సింగిల్ థియేటర్లు. కొండవీటి సింహం నుంచి దేవర వరకు.. ప్రేమాభిషేకం నుంచి తండేల్ వరకు.. పసివాడి ప్రాణం నుంచి..గేమ్ ఛేంజర్ వరకు హీరో తెరమీద కనపడగానే.. ప్రేక్షకులు వేసిన విజిల్స్, చప్పట్లు ఇంకా ఇక్కడ ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. నేల టిక్కెట్ నుంచి సోఫా సీటు వరకు.. రీల్ ప్రొజెక్టర్ నుంచి శాటిలైట్ డిజిటల్ ప్రొజెక్టర్ వరకు.. తెలుగు సినిమా గమనానికి ఇవి నిదర్శనం. కాలానుగుణంగా ఆధునిక హంగులు అద్దుకుంటూ సినీ ప్రియులను అలరిస్తూనే ఉన్నాయి. ఒక్కో సినిమా హాలుది ఒక్కో చరిత్ర, జ్ఞాపకం. స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్నవీ ఉన్నాయి. పైరసీల బెడద.. మల్టీప్లెక్స్‌ల పోటీ తట్టుకుని నిలబడి సింగిల్ థియేటర్లకు ఆనవాళ్లుగా కొన్ని మిగిలిపోతే.. కాల గర్భంలో కలిసి పోయినవి మరెన్నో. తెలుగు చిత్ర పరిశ్రమకు రెండు కళ్లు ఎన్టీఆర్, ఏఎన్ఆర్ చిత్రాలను నేల టిక్కెట్‌పై చూసిన వాళ్లు.. జూ.ఎన్టీఆర్, నాగచైతన్య సినిమాలను అత్యాధునిక సౌకర్యాలతో.. ఇవే థియేటర్లలో చూశారు.



ఎనిమిది దశాబ్దాలు.. 14న కూలీతో పునః ప్రారంభం

గుంటూరు మెడికల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో ఎనిమిది దశాబ్దాలుగా అలరిస్తోంది శ్రీ సరస్వతి పిక్చర్ ప్యాలెస్. స్వాతంత్ర్యం పొందిన మూడేళ్లకు.. 1950లో వాసిరెడ్డి పార్థసారథి ప్రసాద్ ఈ థియేటర్‌ను నిర్మించారు. 1989లో డాక్టర్ త్రిపురనేని రాధాకృష్ణ ఈ థియేటర్ కొనుగోలు చేశారు. ఇటీవల జిల్లాలో మొట్ట మొదటిసారిగా లేజర్ ప్రొజెక్షన్‌తో డాల్బీ సౌండ్ సిస్టమ్‌తో ఈ థియేటర్‌ను ఆధునీకరించారు. 385 సీట్ల కెపాసిటీ గల ఈ థియేటర్‌ను ఈ నెల 14న రజనీకాంత్ నటించిన కూలీ సినిమాతో పునఃప్రారంభిస్తున్నారు. ప్రేమ్ నగర్ సినిమా అద్భుతమైన కలెక్షన్లతో 175 రోజుల పాటు ఇక్కడ ప్రదర్శితం కావడంతో దివంగత నిర్మాత డి.రామానాయుడుకి ఈ హాలు అంటే ప్రత్యేక అభిమానం. దాదాపు 18 ఏళ్లపాటు సురేష్ ప్రొడక్షన్స్ ఈ హాలును లీజుకు తీసుకుంది.

చరిత్రకు సాక్ష్యం నాజ్

గుంటూరు (తూర్పు) ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నాజ్ థియేటర్లు ఏర్పడిన తర్వాత ఆ ప్రాంతం.. నాజ్ సెంటర్‌గా మారింది. 1958 జనవరి 11న జమున, షైనావతి, శివాజీ గణేషన్ నటించిన బొమ్మల పెళ్లి చిత్రంతో ఈ థియేటర్ల ప్రస్థానం మొదలైంది. నాటి ఎంపీ కొత్త రఘురామయ్య దీనిని ప్రారంభించారు. 1,547 సీటింగ్ సామర్థ్యం తో రూ.25 పైసల టికెట్ తో ప్రారంభమైంది. 1965లో నాజ్ థియేటర్ పై నాజ్ లిటిల్ బిగ్ పేరుతో రాష్ట్రంలోని తొలి ఏసీ సౌకర్యంతో మరో థియేటర్‌ను నిర్మించారు. నాజ్ లిటిల్ బిగ్ ఆ తర్వాత నాజ్ అప్సరగా మార్చారు. సురేష్ ప్రొడక్షన్ తొలి సినిమా అనురాగం ఈ థియేటర్లోనే ప్రదర్శించారు. వీటితోపాటు ఎన్టీ రామారావు నటించిన రాముడు భీముడు, కోడలు దిద్దిన కాపురం, దానవీరశూరకర్ణతో పాటు అనేక మహత్తర దృశ్య కావ్యాలకు ఈ థియేటర్ సాక్షిగా నిలిచింది. 1983లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు.. అప్పటి మంత్రి చేబ్రోలు హనుమయ్యతో కలిసి స్మాల్ స్కేల్ ఇండస్ట్రీపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంతేగాక షూటింగ్ నిమిత్తం వచ్చే నటి, నటులకు ఈ థియేటర్లోనే బస ఏర్పాటు చేసేవారు. చాలా మంది సినీ ప్రముఖులు ఇక్కడ చిత్రాలను వీక్షించారు. దానవీరశూరకర్ణ సినిమాని రోజుకు ఆరు షోలను ప్రదర్శించారు. ప్రస్తుతం 700 సీట్లతో ఆధునికీకరించి.. టిక్కెట్ ధర ప్రస్తుతం రూ.250కు చేరింది. ఇప్పటివరకు నాజ్ థియేటర్లో చిరంజీవి నటించిన ఇంద్ర సినిమా, నాజ్ అప్సరలో టి.కృష్ణ దర్శకత్వం వహించిన నేటి భారతం 175 రోజులు ప్రదర్శించారు. 2018 తర్వాత ఏ ఒక్క సినిమా కూడా 100 రోజులు ఆడలేదని యాజమాన్యం చెబుతోంది.



నాజ్ థియేటర్

● 60 ఏళ్ల నుంచి బొమ్మ పడుతోంది

తెనాలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా ప్యారిస్ తెనాలి.. కళలకు పుట్టినిల్లు. సూపర్ స్టార్ కృష్ణ నుంచి ఎంతో మంది సినీ స్టార్లు ఇక్కడి నుంచి పుట్టుకొచ్చినవారే. వారు నటించిన సినిమాలు అందించేందుకు థియేటర్లకూ ఇక్కడ కొదవ లేదు. తెనాలిలో గెయిటీ, అలంకార్, స్వరాజ్, వీనస్, వెంకటేశ్వర, పెమ్మసాని, లక్ష్మి, శ్రీలక్ష్మి, ఆషా, ప్రియ, శ్రీప్రియ, సంగమేశ్వర, మినీ సంగమేస్వర వంటి థియేటర్‌లు గత 80 ఏళ్లుగా కొనసాగుతూ వచ్చాయి. డిజిటల్ యుగంలో.. పైరసీలతో విసిగిపోయి, లాభాలు లేక కొన్ని థియేటర్లు కనుమరుగయ్యాయి. స్వరాజ్, వేద, వీనస్, వెంకటేశ్వర, రత్న థియేటర్‌లు వాణిజ్య కేంద్రాలుగా మారిపోయాయి. రత్న, వెంకటేశ్వర థియేటర్‌లు స్వాతంత్ర్యానికి ముందే ప్రారంభమైతే.., స్వరాజ్ మాత్రం 1948లో ప్రారంభించారు. స్వాతంత్ర్యం రావడంతో ఈ థియేటర్‌కు స్వరాజ్ అని పేరుపెట్టారు. ఎన్టీఆర్ తనయుడు రామకృష్ణ పేరుపై అప్పట్లో నిర్మించిన రామకృష్ణ థియేటర్‌ను ప్రస్తుత కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తండ్రి కొనుగోలు చేసి, దానికి పెమ్మసాని థియేటర్‌గా పేరు మార్చారు.

అలంకార్, గెయిటీ

అలంకార్, గెయిటీ థియేటర్లు.. ఎన్టీఆర్, ఏఎన్నార్ సినిమాలకు ప్రత్యేకం. అలంకార్ థియేటర్‌ను 1964లో బండ్ల పుల్లయ్య నిర్మించారు. భక్తకన్నప్ప, కృష్ణవేణి, చిక్కడు దొరకడు, ఎన్టీఆర్ కథా నాయకుడు, పరమానందయ్య శిష్యుల కథ వంటి పాత చిత్రాల నుంచి భైరవద్వీపం, పసివాడి ప్రాణం, యమలీల, సంఘర్షణ వంటి చిత్రాలు శత దినోత్సవాలు జరుపుకున్నాయి. గెయిటీ థియేటర్‌ను 1965లో ప్రారంభించారు. సుబ్బారావు, రంగారావు అనే సోదరులు దీనిని నిర్వహిస్తూ వచ్చారు. ప్రస్తుతం వీరయ్యచౌదరి దీని నిర్వహణ చూస్తున్నారు. ఎన్టీఆర్, బాలకృష్ణ సినిమాలు ఎక్కువగా ఆడేవని వివరించారు. సమరసింహారెడ్డి 180 రోజులు ఆడితే, నరసింహానాయుడు సినిమా 175 రోజులు ఆడింది. పెద్దన్నయ్య, వేటగాడు, వంటి సినిమాలు 100 రోజులు ఆడాయి.


గెయిటీ థియేటర్

● సరికొత్తగా..

బాపట్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బాపట్లలోని శ్రీనివాస మహల్‌కు 45 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. ఈ థియేటర్‌లో వంద రోజులు ఆడిన సినిమాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. కాలక్రమేణ నూతన హంగులను సంతరించకుంది. కానీ, ఈ థియేటర్ పక్కనే ఉన్న అలంకార్, అన్నపూర్ణ థియేటర్లు శిథిలావస్థకు చేరి మూతపడ్డాయి.



● ఐదు దశాబ్దాల ఆనవాళ్లు..

రేపల్లె, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలోని రేపల్లె పట్టణంలో ఐదు దశాబ్దాల కిందట నిర్మించిన కృష్ణా టాకీస్, రాజ్యలక్ష్మీ థియేటర్లు.. ఐదేళ్ల క్రితం.. డీటీఎస్, ఏసీ సౌకర్యాలు పొందాయి. నేల, బెంచి, కుర్చీ, బాల్కని నాలుగు కేటగిరిలుగా ఉన్న ఇవి.. రెండు విభాగాలు మార్చి ప్రేక్షకులకు అందుబాటులో ఉన్నాయి. కృష్ణా టాకీస్ థియేటర్ ఉన్న ప్రాంతం.. కృష్ణాటాకీస్ సెంటర్‌గా స్థిరపడింది. ఒకప్పుడు ఈ థియేటర్లలో.. వందల సినిమాలు వంద రోజులు ఆడాయి.


కృష్ణా థియేటర్



రాజ్యలక్ష్మిథియేటర్

● స్వాతంత్ర్యం గుర్తులు..

చెరుకుపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లిలో 1947లో గ్రామానికి చెందిన మజ్జి కోటయ్య జైహింద్ టాకీస్ ప్రారంభించారు. స్వాతంత్ర్యానికి పూర్వం.. ఈ స్థలంలో స్వాతంత్ర సమర యోధులు సమావేశమయ్యేవారని.. దానికి గుర్తుగా ఈ థియేటర్‌కు జైహిందు అని పెట్టారు. చుట్టు పక్కల మండలాలకు అప్పట్లో ఇదొక్కటే థియేటర్. సీనియర్ ఎన్టీఆర్ నటించిన కొండవీటి సింహం 100 షోలు పూర్తిచేసుకుంది. మెగాస్టార్ చిరంజీవి నటించిన అత్తకు యముడు.. అమ్మాయికి మొగుడు 60 షోలు, అక్కినేని నాగేశ్వరరావు నటించిన ప్రేమాభిషేకం 50 షోలు ప్రదర్శింపబడ్డాయి. ఇప్పుడు డాల్బీ అట్మాస్‌గా అప్డేట్ అయ్యింది. గుళ్ళపల్లి గ్రామంలో తాతా నారాయణమూర్తి, గుర్రం కుటుంబరావు, కాటూరి నాగమల్లేశ్వరరావు, పువ్వాడ వీరకుమారి భాగస్వామ్యంతో 1972లో బాలాజీ పిక్చర్ ప్యాలెస్‌ను ప్రారంభించారు. ఎన్టీఆర్ శ్రీకృష్ణ సత్య తులాభారం.. 50 రోజులు ప్రదర్శింపబడింది. మెగాస్టార్ చిరంజీవి ఇంద్ర సినిమా 60 రోజులు ప్రదర్శింపబడింది. ఏసీ థియేటర్‌గా దీనిని మార్చారు.



జైహింద్‌టాకీస్

● 60 ఏళ్ల నుంచి..అధునాత హంగులతో..

చీరాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చీరాల్లో పదికి పైగా సినిమా థియేటర్స్ ఉండేవి. ప్రస్తుతం నాలుగు థియేటర్లు మాత్రమే నడుస్తున్నాయి. వీటిల్లో మోహన్ థియేటర్ 1956లో ప్రారంభమైంది. ఇందులో అక్కినేని నాగేశ్వరరావు రోజులు మారాయి చిత్రం అత్యధికంగా 156 రోజులు ఆడిన మొట్ట మొదటి చిత్రంగా చరిత్ర సృష్టించింది. అనంతరం ముత్యాల ముగ్గు, నాగార్జున నటించిన హలో బ్రదర్, అర్జున్ నటించిన ఒకే ఒక్కడు వంటి చిత్రాలు 100 రోజులు ఆడి ప్రేక్షాదరణ పొందాయి. అలాగే చీరాల్లో శాంతి థియేటర్ 1967లో ప్రారంభమై దేవుడు చేసిన మనుషులు, నువ్వు నాకు నచ్చావ్, లక్ష్మీనరసింహా, దేశముదురు వంటి చిత్రాలు 100 రోజులు ఆడి అందరినీ అలరించాయి. టెక్నాలజీని అందిపుచ్చుకుని నేటికీ నూతన హంగులతో ప్రేక్షకులతో ఈ థియేటర్లు సందడి చేస్తున్నాయి.



శాంతి థియేటర్

● సినీ వైభవానికి మహళ్లు..

వినుకొండ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ఉన్న అరుణ హాలు 64 ఏళ్లు పూర్తి చేసుకుంది. నూతన హంగులతో సినీ ప్రేక్షకులను ఇప్పటికీ అలరిస్తోంది. ఈ థియేటర్‌లో నర్తనశాల 50, ప్రేమాభిషేకం 50 రోజులు రెగ్యులర్ షోస్. నూన్ షోస్‌తో 100 రోజులు పూర్తి చేసుకున్నాయి. అలాగే పట్టణంలోని సురేష్ మహల్ 1975లో సోగ్గాడు సినిమాతో ప్రారంభమైంది. 50 ఏళ్ల క్రితం తెర బొమ్మలతో మొదలై 70ఎంఎం రీల్స్, నేడు యూఎఫ్‌వో, క్యూబ్ (శాటిలైట్) ద్వారా సినిమాలు ప్రదర్శితమవుతున్నాయి. ఈ రెండు థియేటర్లలో.. డీటీఎస్‌తో నేటి యువత విజిల్స్ వేసేలా సినిమాలు ఆడుతున్నాయి.



అరుణ హాల్

బస్సుల్లో పెరగనున్న..

మహిళల ఉచిత ప్రయాణానికి ఆర్టీసీ సమాయత్తం

స్త్రీ శక్తి మేరకు ఏర్పాట్లు


ఫుట్ బోర్డు పనులు ,


ఫుట్ బోర్డు మధ్యలో ఐరన్ పైపులు


అత్యవసర ద్వారం


హ్యాండిల్ స్లింగ్స్

● పల్లెవెలుగు బస్సుల్లో ప్రత్యేక సౌకర్యాలు
● బస్టాండ్లలోనూ.. అదనపు హంగులు.
● మహిళల రద్దీకి అనుగుణంగా చర్యలు

గుంటూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని స్త్రీ శక్తి పథకం పేరుతో.. ఆగస్టు 15 నుంచి ప్రారంభించనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఆ దిశగా ఆర్టీసీ యంత్రాంగం సమాయత్తమవుతోంది. ముఖ్యంగా ఉచిత ప్రయాణంలో మహిళలకు ఎటువంటి ఇబ్బందులేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ప్రధానంగా పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, నగరంలోని మెట్రో, ఆర్డినరీ సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు ఇప్పటికే ఆర్టీసీ ప్రకటించింది. మరో వారం రోజుల్లో స్వాతంత్ర దినోత్సవం రోజు నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలుకు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు ఏర్పాట్లకు.. సంబంధించి ఇప్పటికే నెల్లూరు జోన్ పరిధిలోని గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని అధికారులతో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణ, జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి గుంటూరులో సమావేశం నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా పథకం ప్రారంభ దశలో మహిళలు పెద్ద ఎత్తున బస్టాండ్‌లకు చేరుకుంటారని, బస్సుల్లో రాకపోకలకు కూడా ఇప్పుడున్న రద్దీకి 20 నుంచి 30 శాతం అదనంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. విభజిత గుంటూరు జిల్లా పరిధిలోని గుంటూరు -1, 2 డిపోలతో పాటు పొన్నూరు, మంగళగిరి, తెనాలి డిపోలలో 403 సర్వీసులుండగా ఇందులో 275 పల్లెవెలుగు సర్వీసుంటాయని ఇన్‌చార్జి డీపీటీవో సామ్రాజ్యం తెలిపారు. ఇప్పటికే 80 రూట్లలో రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. ప్రస్తుతం పాఠశాల విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఉచితంగా రాకపోకలు సాగిస్తుండగా ఇకపై కళాశాలల విద్యార్థినుల కోసం కూడా అదనపు ట్రిప్పులను నడుపుతామన్నారు. అలానే బాపట్ల జిల్లా పరిధిలోని బాపట్ల, చీరాల, రేపల్లె, అద్దంకి డిపోల్లోనూ 253 సర్వీసుల్లో 212 పల్లె వెలుగు సర్వీసులు అత్యధికంగా ఉన్నాయని తెలిపారు. మహిళల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బాపట్ల జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో)గా వ్యవహరిస్తున్న సామ్రాజ్యం గుంటూరు ఇన్‌చార్జి డీపీటీవో కూడా కావటంతో ఆమె రెండు జిల్లాల్లోనూ ఆపరేషన్ వ్యవహారాలను పర్యవేక్షించడం తలకుమించిన భారంగా మారిందన్న వాదన వినిపిస్తోంది.

పల్లె వెలుగు బస్సులకు అదనపు ఏర్పాట్లు

ముఖ్యంగా పల్లెవెలుగు బస్సుల్లో మహిళల తాకిడి ఎక్కువగా ఉంటుందని అంచనా వేసిన అధికారులు ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. బస్సు ఫుట్ బోర్డును విస్తరించి , మెట్లు జారకుండా గ్రిప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కే సమయంలో చేతులు పట్టుకునేలా మెట్ల మధ్యలో రాడ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అలానే బస్సులో మహిళలు నిల్చొని పట్టుకునేలా హ్యాండ్ స్లింగ్స్ అందుబాటులోకి తెస్తున్నారు. మరో వైపు విపత్కర పరిస్థితుల్లో ప్రమాదం నుంచి బయటపడేలా ఎమర్జన్సీ డోర్‌లను కూడా అందుబాటులో ఉంచుతున్నారు. ఈ డోర్‌కు హ్యాండ్‌లాక్, రైల్వే లాక్, టవర్ బోల్ట్ అమర్చుతున్నారు. ఈ మేరకు పల్లె వెలుగు బస్సులకు ఆర్టీసీ గ్యారేజ్‌లలో శరవేగంగా పనులు జరుగుతున్నాయి.

బస్టాండ్‌లలో అదనపు సౌకర్యాలు

అలానే బస్టాండ్‌లలో కూడా ప్రస్తుతమున్న సీట్లకు అదనంగా సీట్లను పెంచుతున్నట్లు గుంటూరు జిల్లా ఇన్‌చార్జి డీపీటీవో సామ్రాజ్యం తెలిపారు. ప్రస్తుతమున్నవాటి కంటే అదనంగా మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఎన్టీఆర్ బస్టాండ్‌లో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను కూడా అందుబాటులోకి తెస్తున్నట్లు డీపీటీవో పేర్కొన్నారు.

ఉచిత ప్రయాణానికి ఐడీ కార్డు చూపాలి

ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణ పథకం అమలుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు డీపీటీవో సామ్రాజ్యం తెలిపారు. బస్సులలో ఉచిత ప్రయాణానికి మహిళలు ఆధార్ వంటి ఏదో ఒక ఐడీ కార్డు తప్పనిసరిగా సిబ్బందికి చూపించాలని పేర్కొన్నారు.

కిరాయి లొల్లి..మళ్లీ!

● నేడు సమావేశానికి రావాలని యజమానులకు ఎస్ఎంఎస్‌లు

గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రాష్ట్రాలకు గుంటూరు నగరం నుంచి మిర్చిని రవాణ చేసే లారీల కిరాయి పెంచేందుకు మళ్లీ ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. గతేడాది ఒక అసోసియేషన్ కనుసన్నల్లో భారీగా కిరాయి పెంచి ఇక్కడి వ్యాపారం అంతా వేరే ప్రాంతాలకు వెళ్లేలా చేయడంతో.. ఎక్స్‌పోర్టర్లు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. అప్పట్లో ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అసోసియేషన్‌తో సంబంధం లేకుండా ఎగుమతిదారులు ఇష్టమొచ్చిన లారీ యజమాని ద్వారా సరుకు రవాణ చేసుకొనేందుకు అవకాశం కల్పించాలని నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా అడ్డు పడితే కేసులు నమోదు చేయాలని పోలీసు శాఖని ఆదేశించారు. దాంతో అసోసియేషన్ ప్రమేయం పూర్తిగా తొలగిపోయింది. అప్పటి నుంచి ఈశాన్య రాష్ట్రాలకు రూ.1.20 లక్షలకే లారీ యజమానులు మిర్చిని రవాణా చేస్తున్నాయి. దీంతో మార్కెట్ కొంతమేరకు మళ్లీ ఇక్కడ పుంజుకొంది.

గతంలో వైసీపీ కనుసన్నల్లో..

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు ఒక అసోసియేషన్‌ని ఏర్పాటు చేసి.. ఈశాన్య రాష్ట్రాలకు లారీ కిరాయిని వారి.. కనుసన్నల్లోనే జరిగేలా వ్యవస్థని నెలకొల్పారు. దీంతో కిరాయి రూ.1.50 లక్షల నుంచి రూ. 1.70 లక్షలు లారీకి వసూలు చేసేవారు. అది చాలక ఇంకా పెంచాలని డిమాండ్ కూడా చేశారు. అంతకంటే ఎవరైనా లారీ ఓనరు తక్కువ కిరాయికి ఒప్పందం చేసుకొంటే ఆ లారీకి అడ్డు పడి నానా యాగీ చేసేవాళ్లు. టైర్లు కోసేయడం, లారీ యజమానిపై దాడి చేయడం వంటివి చేసేవారు. దీంతో ఎగుమతి వ్యాపారులు బెంబేలెత్తిపోయేవారు. మరోవైపు ఖమ్మంలో అప్పట్లో రూ.1.20 లక్షలకే లారీలు కిరాయికి పెట్టేవాళ్లు. ఈ కారణంగా చాలా వరకు వ్యాపారం అక్కడికి తరలిపోయింది.

కాగా ఇప్పుడు మళ్లీ ఈశాన్య రాష్ట్రాలకు కిరాయి పెంచేందుకు నార్త్ ఈస్టు లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ యజమానులంతా సమావేశానికి రావాలని గురువారం కొంతమంది ఫోన్లకు ఎస్ఎంఎస్‌లు వెళ్లాయి. బుడంపాడు రోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద ఈ సమావేశం నిర్వహించనున్నారు. దీనిపై ఇంటెలిజెన్స్ వర్గాలు వివరాలు సేకరిస్తున్నాయి. లారీ ఓనర్లు వాళ్ల సమస్యలపై చర్చించుకొంటే తమకు ఎలాంటి ఇబ్బంది లేదని, అలా కాకుండా గతంలో మాదిరి కిరాయి పెంచుతామంటే ఇక్కడి మార్కెట్ నష్టపోతుందని ఎగుమతి వ్యాపారులు తెలిపారు.

స్వయం సహాయక బృందాల పనితీరుపై..

కేంద్ర బృందం పరిశీలన

గుంటూరు సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న స్వయం సహాయక బృందాల పనితీరును జాతీయ బృందం గురువారం పరిశీలించింది. గురువారం గుంటూరు మిర్చి యార్డు, వ్యవసాయ కమిషనరేట్‌తో పాటు, పలు సంఘాలు నిర్వహిస్తున్న వ్యాపార సంస్థలను సందర్శించిన బృంద సభ్యులు వివరాలు సేకరించారు. అనంతరం వివిధ మండలా నుంచి వచ్చిన స్వయం సహాయక సంఘ సభ్యులతో భేటీ అయ్యారు. ఈ భేటీ లో పచ్చళ్లు, కారప్పొడుల ఉత్పత్తిదారుల అనుభవాలు, ఔత్సాహికుల వివరాలను తెలుసుకున్నారు. అరవింద్ పాటిధర్, జనార్దన్‌రౌట్, గోపాల కృష్ణ, శివ శంకర్ ప్రసాద్, రాజశ్రీ, పీడీ టీవీ విజయలక్ష్మి, ఎన్.కిరణ్ కుమార్, టి. అశోక్ కుమార్ పాల్గొన్నారు.


మిల్లును పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఆర్‌వీఆర్ జేసీ స్నాతకోత్సవం రేపు

● హాజరుకానున్న సుప్రీం కోర్టు మాజీ సీజే ఎన్.వి.రమణ

గుంటూరు విద్య ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక చేడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం 10వ స్నాతకోత్సవం నిర్వహిస్తున్నట్లు కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ రాయపాటి గోపాల కృష్ణ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఎన్వీ రమణ, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె.మధు మూర్తి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. 2021 - 25 విద్యా సంవత్సరం, 37వ బ్యాచ్ బీటెక్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగాల్లో డిగ్రీ పూర్తి చేసుకున్న 1,023 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను, 153 మందికి పీజీ పట్టాలు పొందనున్నారని పేర్కొన్నారు. గోల్డ్ మెడల్స్ ప్రదానం ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, కళాశాల అకడమిక్ అండ్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్.ఎన్.వి. శ్రీనివాసరావు తదితరులు ఏర్పాట్లను గురువారం పర్యవేక్షించారు.


సుప్రీంకోర్టు మాజీ సీజే ఎన్వీ రమణ, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య మధు మూర్తి

మిర్చి కాటా వేయగానే..

రైతు ఫోన్‌కి ఎస్ఎంఎస్ వెళ్లాలి

● మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత

గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డులో రైతులు తీసుకొచ్చిన టిక్కీలు అమ్మకం పూర్తి అయ్యి.. కాటా వేయగానే ఆటోమేటిక్‌గా స్లిప్పు జనరేట్ కావాలని, సంబంధిత రైతు మొబైల్ నంబరుకు ఎస్ఎంఎస్ ద్వారా చేరేలా చూడాలని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ విజయ సునీత ఆదేశించారు. గురువారం సాయంత్రం చుట్టుగుంటలోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో ఆమె గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విజయ సునీత మాట్లాడుతూ.. ఈనామ్‌లో ఇంకా ఏమైనా లోటుపాట్లు ఉంటే వచ్చే సీజన్ నాటికి సవరించి 100 శాతం పకడ్బందీగా అమలు జరిగేలా చూడాలన్నారు. మచ్చు కాయలు, జీరో, కటింగ్, బిల్ టూ బిల్ బిజినెస్‌ల రూపు మాపాలని స్పష్టం చేశారు. గత సీజన్‌లో దాదాపుగా మార్కెట్ ఫీజు రూ.10 కోట్ల మేరకు తగ్గిందని, దానిని రాబోయే రోజుల్లో భర్తీ చేయాలన్నారు. మిర్చి మార్కెట్ పెరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే సీజన్‌ని దృష్టిలో పెట్టుకొని ఇప్పటినుంచే అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు విశ్రాంతి గదులు, లైటింగ్ వంటి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రత్తిపాడు ఏఎంసీ పరిధిలో వ్యాపారాలు చేస్తున్న లైసెన్సులను ఆ కమిటీకి బదిలీ చేసే విషయంపై ప్రతిపాదనలు పంపించాలన్నారు. మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు, సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ చంద్రిక, డీడీ దివాకర్, ఏడీ సత్యన్నారాయణ చౌదరి, ఎస్ఈ శేషగిరిరావు, యార్డు ఇన్‌ఛార్జ్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


గుంటూరు ఏఎంసీ అధికారులతో సమావేశమైన డైరెక్టర్ విజయ సునీత, జేడీలు

కోటప్పకొండ గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్ప కొండ త్రికూటేశ్వరస్వామి గిరి ప్రదర్శన చేసే భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నారు. శని వారం శ్రావణ పౌర్ణమి (రాఖీ పౌర్ణమి) సందర్భముగా కోటప్పకొండ త్రికూటేశ్వర స్వామి వారి గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఉదయం 5.00 గంటలకు ప్రారంభమవుతుం దని గిరి ప్రదక్షిణ చేసే భక్తులకు ఘాట్ రోడ్డు దగ్గర ఉన్న విజయ గణపతి దేవా లయం వద్ద అల్పాహారం ఏర్పాటు చేసినట్లు కోటప్పకొండ గిరి ప్రదక్షిణ సేవాసమితి అధ్యక్షుడు అనుమాలు వెంకయ్య చౌదరి తెలిపారు. మార్గమధ్యంలో తాగునీటి సదు పాయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

నాదెండ్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని గణపవరం, కనపర్రు, సాతులూరు ఫీడర్ల పరిధిలో శనివారం మరమ్మతుల కార ణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. ఈ మరమ్మతుల వల్ల గణప వరం, కొత్త బైపాస్ రోడ్డు, కనపర్రు, షైనం పాడు, సాతులూరు గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఆయన వివరించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

యడ్లపాడు, ఆగష్టు 7 (ఆంధ్రజ్యోతి): పదహారో నంబరు జాతీయ రహదారిపై జరి గిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రోడ్డుదాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్ళడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిమ్మాపురం కూడలిలో అదే గ్రామానికి చెందిన ఎం.రమేష్ రోడ్డు దాటుతుండగా చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు వెళుతున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేష్ రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడగా, ఢీకొట్టిన ద్విచక్రవాహనదా రుడు వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. స్థానికులు గమనించి హైవే పెట్రోలింగ్ పోలీ సులకు సమాచారం అందించారు. గాయాల పాలైన రమేష్‌ను చిలకలూరిపేట ప్రభుత్వా సుపత్రికి తరలించారు.

ముగిసిన శిక్షణ తరగతులు

ఈపూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు అంతర పంటలను సాగు విధానం ఆచరించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా శిక్షకుడు సైదయ్య అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రలో జరుగుతున్న శిక్షణ తరగ తులు గురువారం ముగిశాయి. ఈ సంద ర్భంగా సైదయ్య మాట్లాడుతూ అంతర పంటల విధానం ఆచరించడం వలన రైతు లకు అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. మిరప పంటలో అంతర పంటలుగా ఉల్లి, బంతి కొత్తిమీర, ముల్లంగి, సజ్జసాగు చేయడం వలన పంటకు ఆశించే తామర పురుగు, రసం పీల్చే పురుగులను నివారించ వచ్చునన్నారు. ఈ ఏడాది ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం సాగు చేసేలా రైతు లకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్ర మంలో మండల వ్యవసాయాధికారి ఆర్. రామారావు, జిల్లా మాస్టర్ ట్రైనర్ తిరుపతి రావు,శివలక్ష్మి, ఆంజనేయులు, హనుమంతు రావు తదితరులు పాల్గొన్నారు.

దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్‌కు సర్వే ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలి వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సర్వే ఉద్యోగులు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న గ్రామ సర్వేయర్ విద్యాసాగర్‌పై భౌతిక దాడులకు పాల్పడిన వారిపై పోలీసులు తక్ష ణమే కఠిన చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా సర్వే ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు జి.భాగ్యలక్ష్మి గురువారం డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబుకు వినతిపత్రం సమర్పిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిలక లూరిపేట పట్టణ పరిధిలో విధి నిర్వహణలో ఉన్న గ్రామ సర్వేయర్ విద్యాసాగర్‌పై చల్లా శ్రీనివాసరావు అతని కుమారులు బుధవారం దాడికి పాల్పడ్డారన్నారు. సదరు ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ఘటనపై పోలీసు శాఖ తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఈ తరహా దాడులు పునరావృతం కాకుండా సర్వే ఉద్యోగులకు భద్రత కల్పించాలన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆమె కోరారు. కార్యక్రమంలో సర్వే ఉద్యోగుల సంఘ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై శ్రీనివాస్ రావు, పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్ యాసిన్ భాష, పలువురు మండల సర్వేయర్లు గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం

● ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ హామీలలో భాగంగా పలు సంక్షేమ పథ కాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ చదల వాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట పట్ట ణంలోని 31వ వార్డులో బుధవారం రాత్రి సుపరిపా లన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అర విందబాబు మాట్లాడుతూ మహిళల కోసం ఉచిత బస్సు పథకం ఆగస్టు 15నుంచి ప్రారంభం అవుతుంద న్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యక ర్తలు, మహిళలు పాల్గొన్నారు.



నరసరావుపేటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

ఉల్లాస్ అక్షరాంధ్రపై శిక్షణ

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు 7 (ఆంధ్ర జ్యోతి) ఉల్లాస్ - అక్షరాంధ్ర వయోజన అక్షరా స్యత కార్యక్రమంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం పట్టణంలోని ముని సిపల్ గెస్ట్ హౌస్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వయోజన విద్యాశాఖ ఉపసంచాలకులు కె.అంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరాస్యతలో మన రాష్ట్రం దేశంలో ఉన్న చాలా రాష్ట్రాల కన్నా వెనుకబడి ఉన్నందున 2029నాటికి నూరుశాతం అక్షరాస్యత సాధించేందుకు కృషిచేయాలన్నారు. త్వరలో బాపట్ల జిల్లాలో ఈ కార్య క్రమం ప్రారంభం కానున్న సందర్భంగా ఈ శిక్షణ కార్య క్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డీఆర్‌డీఏ, మెప్మా లలో ఉన్న స్వయం సహాయక బృందాల మహిళలు, ఉపాధి హామీ కూలీలో ఉన్న చదువు రాని వారిని గుర్తించి వారికి చదువు చెప్పడానికి ప్రతి పదిమందికి ఒక వలంటీర్ టీచరు చొప్పున మొత్తం 1,27,565 మంది చదువురాని వారిని ఎంపికచేసి వాటి వివరా లను అందించాలని ఆదేశించారు. ఎంపికచేసిన టీచ ర్లకు మండలస్థాయిలో శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం టీచర్లు వారికి కేటాయించిన అభ్యాసకులకు క్రియాత్మక, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్య తను అందించాలన్నారు. బాపట్ల జిల్లా నోడల్ అధి కారి జి.మల్లికార్జున్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో కార్యక్రమం విజయవంతం అవడానికి అధికారులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి మండలస్థాయి అధికారులు, మున్సి పల్ కమిషనర్లు, ఎంఈవోలు, ఏపీఎంలు, ఏపీవోలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. కె.మనోరంజన్‌బాబు, రవి గోవర్ధన్‌లు రిసోర్సుపర్సన్స్‌గా వ్యవహరించారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

నరసరావుపేట లీగల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు గురు వారం ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని కాన్ఫ రెన్స్ హాల్‌లో జిల్లాలోని కాలేజి ప్రిన్సిపాల్స్‌తో అవగా హన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం - మానవ మనుగడకు హానికరం అన్నారు. ఈ కార్య క్రమం ద్వారా యువతలో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే హానికరక ప్రభావాలపై అవగాహన పెంపొందించడమే ముఖ్య లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. విద్యాసం స్థలు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేసి వారి సేవలను వినియోగించుకోనున్నట్లు తెలిపారు. కళాశా లలో విద్యార్థుల ప్రవర్తన, నడవడిక, చదువు తదితర అంశాలపై ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా అవగాహన పెంచుకోవాలన్నారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వారు జీవితంలో ఉన్నత శిఖ రాలను అధిరోహించేలా కృషిచేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 370 ఈగల్ క్లబ్స్‌ను ఏర్పాటుచేసి పరిసరా లలో గంజాయి, మాదక ద్రవ్యాలను ఎవరైనా వినియో గించిన లేదా విక్రయించిన సదరు సమాచారాన్ని దగ్గర లోని పోలీస్ వారికి గాని, 1972 టోల్ ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా బాలికల, మహిళల భద్రత కోసం శక్తి యాప్ ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఆగస్టు నెల మొత్తం ఎన్ఫోర్స్‌మెంట్ డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. ప్రిన్సి పాల్స్, పోలీసు అధికారులు డ్రగ్స్ వద్దు బ్రో ప్లకార్డు లను ప్రదర్శించారు. అడ్మిన్ ఎస్పీ సంతోష్, మహిళా పోలీస్ స్టేషన్, నరసరావుపేట సబ్ డివిజన్ ఇంచార్జ్ డీఎస్పీ వెంకటరమణ, శక్తి టీం మహిళా ఎస్ఐలు, సిబ్బంది, పల్నాడు జిల్లా డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసర్ సునీత, డిఐఈవో, నీలావతిదేవి తదితరు లు పాల్గొన్నారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు

యడ్లపాడు, ఆగష్టు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 1 నుంచి జరుగుతున్న తల్లిపాల వారోత్సవాలు గురువా రంతో ముగిశాయి. గురువారం సొలస సెక్టార్ పరిధిలోని సంతపేట అంగన్‌వాడీ కేంద్రంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్ శ్రీదేవి, బి పద్మజ, ఎస్‌కె ఆయేషాబేగం, పి నాగ జ్యోతి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: నాల్గో అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో అంగన్‌వాడీ వర్కర్లు లక్ష్మి, విజ యలక్ష్మి, అంజమ్మ, కళావతి, నాగమల్లేశ్వరి, కల్లి విజయ లక్ష్మి, విఘ్నేశ్వరి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని గణపవరంలో తల్లి పాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో సూపర్ వైజర్ పార్వతి, వైద్యాధికారి ప్రసాదు నాయక్, అనసూయ, ఏఎ న్ఎంలు, బాలింతలు పాల్గొన్నారు.



మెగా జాబ్ మేళా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పిలుపు

చిలకలూరిపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకులు ఈ నెల 12న చిలకలూరిపేట మండలం మద్దిరాలలోని సాదినేని చౌదరయ్య కళాశాలలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగే మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకొని, తమ కలలను సాకారం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం పిలుపునిచ్చారు. ఇక్కడి తన నివాసంలో జాబ్‌మేళా కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. 20కి పైగా పెద్ద సంస్థలు ఈ జాబ్ మేళాలో పాల్గొని అర్హులైన అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తాయన్నారు. టెక్ మహీంద్రా, ఎమ్ఎస్ ఇనుస్ట్రుమెం ట్స్ ఇండియా, మాస్టర్ మైండ్స్, ముత్తూట్ మినీ ఫైనాన్షియర్స్ మెడ్‌ప్లస్, ఇన్నేవ్, ఎపెక్స్ సొల్యూషన్స్ డైకిన్ తదితర కంపెనీల వారు జాబ్ మేళాకు వస్తున్నట్టు చెప్పారు. దూరప్రాంతాల నుంచి వచ్చే నిరుద్యోగులకు ఇబ్బం దులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. వివ రాలకు 91005 66581, 91602 00652, 77029 21219 నంబర్లను సంప్రదిం చాలని కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా నైపుణ్యాధికారి ఈ తమ్మాజీరావు, అడి షన్ అధికారి రామాంజనేయులు, కో ఆర్డినేటర్ సురేష్ తెలిపారు.

రెవెన్యూ సిబ్బందిపై దాడి..కేసు నమోదు

చిలకలూరిపేట, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): స్థానిక గుండయ్య తోటలోని పసు మర్రు గ్రామ పరిధిలోని 803, 807 సర్వే నంబర్లలో ఉన్న 1.20 ఎకరాల్లో 1994- 95లో ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించింది. ప్రస్తుతం అక్కడి స్థితిని తెలుసుకునేందుకు వెళ్లిన.. రెవెన్యూ సిబ్బందిపై దాడి జరి గింది. ఈ ఘటనకు సంబంధించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి కేసు నమోదు అయింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు.. పసుమర్రు సర్వే యర్ విద్యాసాగర్, వీఆర్వో కె.చంద్రశేఖర్, వీఆర్ఏ ఆశీర్వాదం అక్కడకు వెళ్లి వివరాలు సేకరిస్తూ, ఫొటోలు తీస్తున్న సందర్భంలో ఈ దాడి జరిగింది. స్థాని కుడైన వైసీపీ నాయకుడు చల్లా శ్రీనివాసరావు, ఇద్దరు కొడుకులు.. ఫొటోలు తీయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అసభ్య పదజాలంతో అడ్డుకొని సర్వే యర్‌ను కొట్టి, దుస్తులు చించేశారు. అడ్డుపడిన వీఆర్వోను నెట్టేశారు. అధి కారుల ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు. వీఆర్వోలు, సర్వేయర్లు గురువారం తహసీల్దారు కార్యా లయం వద్ద నిరసన తెలిపారు. తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ హుస్సేన్ దాడిని తీవ్రంగా ఖండించారు. బాధ్యులైన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చిలకలూరిపేటలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు

చిలకలూరిపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నువ్వు నాకు రక్ష నేను నీకు రక్ష మనిద్దరం దేశానికి రక్ష అని స్వాతంత్ర్య పోరాట సమయంలో దేశభక్తి స్ఫూర్తిని రగిల్చిన పండుగ రక్షా బంధన్ అని సామాజిక కార్యకర్త లక్ష్మణ్ జీ గురువారం తెలిపారు. స్థానిక జీవీ ఐటీ పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపాల్ దేవులపల్లి ఫణికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ముందస్తు రక్షాబంధన్ వేడు కల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.



విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రాక్టర్

కారుమంచి (శావల్యాపురం) ఆగస్టు 7 (ఆంధ్ర జ్యోతి): వేగంగా వెళుతున్న ట్రాక్టర్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటన శావల్యాపురం మండలం కారుమంచి గ్రామంలో గురువారం జరి గింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్ గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహం వైపు నుంచి వెంకటేశ్వరస్వామి దేవాలయం వైపునకు వేగంగా వెళుతుండగా స్కూల్‌బస్సు అడ్డురావటంతో ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. విద్యుత్ స్తంభం సగా నికి విరిగి రోడ్డుపై నిలిచింది. ట్రాక్టర్ ముందు చక్రం కూడా విరిగి పడింది. అక్కడే ఇంటిముందు నిలబడి ఉన్న ముంద్రు లక్ష్మి అనే మహిళ భయంతో పరుగె త్తుతూ కింద పడి గాయపడింది. ఆమెను కుటుంబస భ్యులు ఆసుపత్రికి తరలించారు.

జైళ్ల శాఖ నేషనల్ కబడ్డీ పోటీలకు సూపరింటెండెంట్ కృష్ణారావు ఎంపిక

వినుకొండ ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) వినుకొండ జైల్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అవర కృష్ణారావు జైలు డిపార్టుమెంట్ స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికైనట్లు కృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి జైలు శాఖ ట్రైనింగ్ అకాడమిలో తర్ఫీదు అనంతరం ఈ నెల 9, 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లో జరగ నున్న జైల్‌శాఖ నేషనల్ కబడ్డీ పోటీల్లో పాల్గొను న్నట్లు ఆయన తెలిపారు.

పేద విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

చిలకలూరిపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికా క్యాలిఫోర్నియా (టిల్సా) వారి ఆధ్వర్యంలో చిలకలూరిపేట మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 1,800మంది పేద విద్యార్థినీ, విద్యార్థులకు నోటు పుస్తకాలు, జామెంట్రీ బాక్స్‌ల పంపిణీ గురువారం జరిగింది. ఆయా పాఠశా లల హెచ్‌ఎంలకు వీటిని చిలకలూరిపేట ఎంఈవో సత్యనారాయణసింగ్ మండల విద్యావనరుల కేంద్రంలో జరిగిన సమావేశంలో అందచేశారు. టిల్సా అధ్యక్షుడు మల్లిక్ కేశవరాజు, మాజీ అధ్యక్షుడు మురళి చందూరి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పాపారావు, రాళ్లబండి మూర్తి దాతృత్వంతో వీటిని అందచేశారు. పేద విద్యార్థులకు సాయం అందించిన టిల్సా కమిటీ సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలి పారు. కోమటినేనివారిపాలెం హైస్కూలు హెచ్‌ఎం ఘంటసాల కరీముల్లా టిల్సా వారితో సంప్రదింపులు జరిపి ఈ సాయం అందేలా చూశారు.

క్రీడల్లో చిలకలూరిపేట విద్యార్థుల ప్రతిభ

చిలకలూరిపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో అథ్లెటిక్ అసోసియేషన్ వారు గురువారం నిర్వహించిన క్రీడలలో స్థానిక మోడరన్ స్టెల్లార్, ఏఎంజీ హైస్కూళ్ల విద్యార్థులు మంచి ప్రతిభ చూపారు. జావలిన్ త్రో అండర్ 16 విభాగంలో మోడరన్ స్టెల్లార్ విద్యార్థి బోళానాథ్ 29.25 మీటర్ల విభాగంలో తృతీయ స్థానం, మెన్స్ విభాగంలో యూ నవీన్ కుమార్ 42 మీటర్ల విభాగం లోనూ తృతీయస్థానం పొందారు. ఏఎంజీ హైస్కూల్లో 9వ తరగతి విద్యార్థి హరి వెంకటఅఖిల్ 16 సంవత్స రాల విభాగంలో పాల్గొని 37మీటర్ల దూరం విసిరి బంగారు పతకాన్ని సాధించాడు.

రైతులకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రాధాన్యం

● నూజెండ్ల పీఏసీఎస్ చైర్‌పర్సన్ బచ్చు అంజిరెడ్డి



గోదామును పరిశీలిస్తున్న ఎంపీపీ మేడం జయ రామిరెడ్డి, సొసైటీ చైర్‌పర్సన్ బచ్చు అంజిరెడ్డి తదితరులు

నూజెండ్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలు అందించేం దుకు సొసైటీ కృషి చేస్తుందని నూజెండ్ల పీఏసీఎస్ చైర్‌పర్స న్ బచ్చు అంజిరెడ్డి అన్నారు. మండల కేంద్రం నూజెండ్లలో పీఏసీఎస్ నిధులతో నిర్మించిన గోదామును వినియోగంలోకి తెచ్చేందుకు అవసరమైన మౌలిక సదుపాయలు కల్పించటం కోసం గురువారం గోదాము పరిసరాలను పరిశీలించారు. ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, సొసైటీ చైర్‌ప ర్సన్ బచ్చు అంజిరెడ్డి, ఎంపీడీవో ఉమాదేవి, పంచాయతీరాజ్ ఏఈ అల్లాభక్షు, సొసైటీ సీఈవో గంగినేని శ్రీనివాసరావు తదితరులు పరిశీలించి చేపట్టాల్సిన అభి వృద్ధి పనుల గురించి చర్చించారు.



చేనేత కార్మికులను సన్మానిస్తున్న టీడీపీ జిల్లా అధికారప్రతినిధి రాపర్ల జగ్గారావు

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

ఈపూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళలో జాతీయ చేనేత దినోత్సవం గురువారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలో అధికశాతం మంది చేనేత వస్త్రాలు నేస్తారని వారి అభివృద్ధికోసం కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకా లను వారికి అందజేస్తుందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు అన్నారు. అనంతరం చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈపూరు సొసైటీ చైర్మన్ విడపలపాటి హనుమయ్య, నూరే కోటేశ్వరరావు, దండే కోటి, సురేష్‌కృష్ణ, బుచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలి

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల సదస్సులో సైకాలజిస్ట్ సుధీర్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణను అలవ ర్చుకోవాలని సైకాలజిస్ట్ సంగ్రా సుధీర్ అన్నారు. గురువారం కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్, డిప్లొమో నూతన విద్యార్థులకు స్వాగతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన సంగ్రా సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యసాధనపై దృష్టిపెట్టి ఉన్నత శిఖరాలకు చేరుకోవాల న్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు, చైర్మన్ షేక్ మీరా వలి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వినుకొండ ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోని అలివేలు మంగా పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం 39వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవ పూజా కార్యక్రమాలు గురువారం భక్తులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని దేవస్థాన ప్రధాన అర్చకులు, విజవాడకు చెందిన మాన్ పరుశురాం కృష్ణామాచారులు వారి బృందం ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు కనులపండువగా నిర్వ హించారు. దేవస్థానంలో విశ్వక్సేన పూజ, నీరాజనం, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాదం వినియోగం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఎయిడ్స్‌పై అవగాహన కోసం రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలు

నర్సరావుపేట లీగల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో భాగమైన డిస్ట్రిక్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవీ ఎయిడ్స్ ఆధ్వర్యంలో గురువారం జిల్లాలోని జూనియర్ కళాశాల స్థాయి విద్యార్థులకు హెచ్ఐవీ ఎయిడ్స్‌పై రెడ్‌రిబ్బన్ క్విజ్ పోటీలను నిర్వహించారు. హార్ట్ జూనియర్ కళాశాలలో ఈ పోటీలను నిర్వహించారు. మొదటి మూడు స్థానాలు పొందిన వారికి నగదు ప్రోత్సాహకంతోపాటు వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణ, జిల్లా ఇంటర్మీడియట్ ఒకేషనల్ అధికారి నీలావతిదేవి, కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

